RNI-TELTEL/2017/72695

12 ఆగస్టు 2023

శుభ తెలంగాణ

శనివారం | మేడ్చల్

ఎడిటర్: చంద్రశేఖర్

సంపుటి : 6, సంచిక :158

వెల:3 రూ/-

www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

ఇదేం నివేదిక..

49 మంది చనిపోతే పరిహారం ఎంతిచ్చారు?

- 500 కోట్లు ఎలా ఖర్చు చేశారో వివరించలేదు
- అంటు వ్యాధుల నివారణకు తీసుకున్నచర్యలేవీ..?
- రెండో నివేదిక కూడా అసంపూర్తేనా..?
- సర్కారు తీరును తప్పు పట్టిన హైకోర్టు

హైదరాబాద్(శుభ తెలంగాణ): వరదలపై ప్రభుత్వం రెండు సార్లు సమర్పించిన నివేదికలు అసంపూర్తిగా ఉన్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఇవాళ ఈ కేసు విచారణ చేపట్టిన న్యాయస్థానం పలు అంశాలను ప్రస్తావించింది. రూ.500 కోట్ల పరిహారంలో ఎవరికి ఎంత సహాయం చేశారో వివరాలు సరిగా లేవని తెలిపింది. ఆ మొత్తాన్ని ఎలా ఖర్చు చేశారో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వరదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను పేర్కొంటూ నివేదికను న్యాయస్థానానికి ప్రభుత్వం తరపు న్యాయవాది ఇవాళ సమర్పించారు. రూ.500 కోట్లు రూపాయలు పునరావాసం కోసం కేటాయించినట్లు ప్రభుత్వం రిపోర్ట్ లో పేర్కొంది. వరదల ప్రభావంతో 49 మంది మృతి చెందినట్లు కోర్టుకు సమర్పించిన నివేదికలో స్పష్టం చేసింది. అయితే.. రెండో సారి ప్రభుత్వం దాఖలు

వివరాలు 2లో..

ముగిసిన ఢిల్లీ పర్యటన, కాంగ్రెస్‌లో విలీనంపై షర్మిల ఏం చెప్పారంటే..!

శంషాబాద్ విమానాశ్రయంలో అడుగుపెట్టిన వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు

కోమటిరెడ్డి ఆహ్వానంపై చూద్దామంటూ కామెంట్

అంతకుముందే పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ కోమటిరెడ్డి

హైదరాబాద్(శుభ తెలంగాణ): వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల తన ఢిల్లీ పర్యటనను ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరికపై మీడియా ప్రశ్నించగా స్పందించలేదు. మరోపక్క, ఆమెను భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి పార్టీలోకి ఆహ్వానించిన సంగతి విదితమే. శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన షర్మిలను కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించింది. దీనికి ఆమె 'చూద్దాం..' అంటూ ముందుకు కదిలారు. పార్టీ విలీనం గురించి మీడియా ప్రతినిధులు పలుమార్లు ప్రశ్నించినా స్పష్టమైన సమాధానం చెప్పలేదు. నవ్వుతూ వెళ్లిపోయారు.

మనసుతో చూశా..

బాధ్యతతో తోడుగా నిలబడ్డా..

- కాబట్టే ప్రతిపక్షానికి దిక్కుతోచడం లేదు, వారి మైండ్‌లో ఫ్యూజులు ఎగిరిపోయాయి
- అమలాపురం సభలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మనది మహిళా పక్షపాత ప్రభుత్వమని సగర్వంగా, సవినయంగా తెలియజేస్తున్నా..
- అమలాపురం జనుపల్లిలో నాల్గవ విడత వైయస్ఆర్ సున్నావడ్డీ నిధులు విడుదల
- 1,05,13,365 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.1354 కోట్లు జమ

అమలాపురం (శుభ తెలంగాణ): ఇళ్లలో మన అక్కచెల్లెమ్మలు సంతోషంగా ఉంటే.. మన కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికం పరంగా, విద్యా, మహిళా రక్షణ కోసం చేయగలిగే ప్రతీ పని కూడా ఈ నాలుగు సంవత్సరాల కాలంలో మీ బిడ్డ అక్కచెల్లెమ్మల కోసం మహిళా పక్షపాత ప్రభుత్వంగానే అడుగులు ముందుకు వేశాడని సగర్వంగా తెలియజేస్తున్నా' అని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ మన రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి ప్రతి ఇంటా సాధికారతతో ఆవిర్భవించాలని బలంగా నమ్మిన ప్రభుత్వంగా అక్కచెల్లెమ్మల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని సీఎం వైయస్ జగన్ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం మండలం జనుపల్లిలో వరుసగా నాల్గవ ఏడాది వైయస్ఆర్ సున్నావడ్డీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1,05,13,365 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో సున్నావడ్డీ నగదు రూ.1,354 కోట్లను జమ చేశారు. ఇప్పటి వరకు సున్నావడ్డీ పథకం ద్వారా ఈ నాలుగేళ్లలో రూ.4,969 కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. అంతకు ముందు అక్కచెల్లెమ్మలను ఉద్దేశించి సీఎం వైయస్ జగన్ ప్రసంగించారు.

సీఎం వైయస్ జగన్ ప్రసంగం..

మనసు నిండా చెరగని ప్రేమతో, చిక్కటి చిరునవ్వులతో, ఆత్మీయతలు, ప్రేమానురాగాలు పంచిపెడుతున్న ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు, ప్రతి తాతకు, ప్రతి సోదరుడికి, ప్రతి స్నేహితుడికి మీ అందరి ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు రెండు చేతులు జోడించి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

దేవుడి దయతో మరో మంచి కార్యక్రమాన్ని మీ అందరి ఆశీస్సులతో అమలాపురంలో జరుపుకుంటున్నాం. అక్కచెల్లెమ్మల సాధికారత కొరకు సంబంధించిన మంచి కార్యక్రమం జరుగుతుంది. మన ఇళ్లలో మన అక్కచెల్లెమ్మలు సంతోషంగా ఉంటే.. మన కుటుంబాలు సంతోషంగా ఉంటాయని ఎప్పుడూ చెబుతూ ఉంటా. అటువంటి సంతోషాన్ని చూడాలని,

వివరాలు 2లో..

సోనియాగాంధేయే ఏం చేయలేకపోయింది..

జగన్‌ను నువ్వేం చేస్తావ్?

బ్రో సినిమాను ఆడించుకోలేకపోయాడు కానీ జగన్‌ను ఆడిస్తాడా? అని ఎద్దేవా

పవన్ కల్యాణ్ ఆటలో అరటిపండు.. అలాంటిది నువ్వేం చేస్తావని ఆగ్రహం

చంద్రబాబు చెప్పినట్లు మాట్లాడుతాడని విమర్శలు

జనసేన, ప్రజారాజ్యం వచ్చి 10, 15 ఏళ్లు అవుతున్నాయి కానీ చేసిందేం లేదని వ్యాఖ్య

హైదరాబాద్(శుభ తెలంగాణ): బ్రో సినిమాను నాలుగు ఆటలు ఆడించుకోలేకపోయిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ పార్టీ అధినేత జగన్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మంత్రి రోజా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... పవన్ కల్యాణ్

వివరాలు 2లో..

3 రోజుల్లో 2 వేల దరఖాస్తులు..

తెలంగాణలో మద్యం దుకాణాల టెండర్లకు భారీ స్పందన

ఎన్నికల సమయం కావడంతో విపరీతమైన పోటీ

రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో టెండర్లకు భారీ స్పందన

నాన్ రిఫండబుల్ ఫీజు కింద ప్రభుత్వ ఖజానాకు భారీగా సమకూరనున్న ఆదాయం

హైదరాబాద్(శుభ తెలంగాణ): తెలంగాణాలో రాబోయే ఎన్నికల సీజన్ నేపథ్యంలో మద్యం షాపుల టెండర్లకు రెస్పాన్స్ భారీగా ఉందని అధికారులు చెబుతున్నారు. షాపులను దక్కించుకుంటే కాసుల వర్షం కురుస్తుందనే ఉద్దేశంతో చాలామంది దరఖాస్తు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే 2 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని వివరించారు. దీంతో

వివరాలు 2లో..

బాబుకు బానిస..

ఫక్తు రాజకీయ వ్యాపారి పవన్

- ప్యాకేజీలకు అమ్ముడుపోవడమే పవన్ రాజకీయం
- విలువలు, వ్యక్తిత్వం, సిద్ధాంతం లేని వ్యక్తి ఆరోపణలకు విలువలేదు
- సంసారం బీజేపీతో.. సహజీవనం టీడీపీతోనా..?
- చంద్రబాబు దగ్గర్నుంచి రాబడే తప్ప కేంద్రంలో పలుకుబడి లేదు
- కేంద్రంతో కాకపోతే అమెరికా, రష్యాలకు చెప్పుకో..
- కేంద్రం నీ మాటవింటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సింది..
- పవన్ కల్యాణ్‌పై పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం

హైదరాబాద్(శుభ తెలంగాణ): విశాఖ బహిరంగ సభలో పవన్ ప్రసంగమంతా అహంకారం, విద్వేషం, అసత్యాలతో కూడిన ఆరోపణలతో నిండిపోయిందని, వైయస్ జగన్‌పై అసూయ, ఆరాటం పవన్ కళ్యాణ్ మాటల్లో కనిపించిందని, తాను నమ్ముకున్న దత్తతండ్రి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారనే భ్రమల్లో పవన్ బతుకుతున్నాడని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పవన్ మాటల్లో తాను నాయకుడిగా ఎదగాలనే

వివరాలు 2లో..

కల్వకుంట్ల కుటుంబం చేస్తున్న లూటీని దేశం చూస్తోంది

హైదరాబాద్(శుభ తెలంగాణ): ప్రధాని మోడీ పాలనలోని డబుల్ ఇంజిన్ సర్కార్ బీఆర్ఎస్ కారును తుక్కు తుక్కు(స్క్రాప్)గా చేస్తుందని, కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ ప్రజలను ఎలా లూటీ చేసి దోచుకుంటుందో మొత్తం దేశమంతా చూస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి

వివరాలు 2లో..

గ్రూప్ 2 వాయిదాపై ఆగస్టు 14న ఫైనల్ డెసిషన్



హైదరాబాద్(శుభ తెలంగాణ): రాష్ట్రంలో గ్రూప్ 2 పరీక్ష వాయిదాపై హైకోర్టులో విచారణ జరిగింది. గ్రూప్ 2 వాయిదాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో ఆగస్టు 14 (సోమవారం)న చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. ఆగస్టు 2 నుండి 30 వరకు వివిధ

వివరాలు 2లో..

రాష్ట్రమంతా రావాలి జగన్..

మళ్లీ కావాలి జగన్ అంటోంది

అమలాపురం సభలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

హైదరాబాద్(శుభ తెలంగాణ): : వైయస్ఆర్ ఆసరా పెన్షన్ అందుకుంటున్న అవ్వాతాతలు, సంక్షేమ పథకాలు అందుకుంటున్న అక్కచెల్లెమ్మలు, ప్రతి ఒక్కరూ కూడా %--%మా భవిష్యత్ నువ్వే జగనన్న%--% అంటున్నారని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు. అమలాపురం సభలో మంత్రి విశ్వరూప్ మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ. 50, రూ. 70 పెన్షన్ ఇచ్చేవాడని, దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి పాదయాత్రలో మాట ఇచ్చినట్లు పెన్షన్‌ను రూ. 200 చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 14 లక్షల పెన్షన్లు ఇస్తే వైయస్ఆర్ ఐదేళ్ళలో దాదాపు 64 లక్షల పెన్షన్లు ఇచ్చారని చెప్పారు. ఐదేళ్ళలో 50 లక్షల పెన్షన్లు ఇచ్చిన ఘనత వైయస్ఆర్‌దని గుర్తుచేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత చంద్రబాబు

వివరాలు 2లో..

మనసుతో చూశా.. బాధ్యతతో తోడుగా నిలబడ్డా..

- మొదటి పేజీ తరువాయి

ప్రతి ఇంట్లో అలాంటి వెలుగులు చూడాలని దేశంలో ఎక్కడా జరగని విధంగా మన రాష్ట్రంలో గొప్ప కార్యక్రమం అమలాపురం నుంచి అమలు చేస్తున్నాం.

ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికం పరంగా, విద్యా సాధికారత కొరకు, వారి రక్షణ కోసం చేయగలిగే ప్రతీ పని కూడా ఈ నాలుగు సంవత్సరాల కాలంలో మీ బిడ్డ అక్కచెల్లెమ్మల కోసం మహిళా పక్షపాత ప్రభుత్వంగానే అడుగులు ముందుకు వేశాడని సగర్వంగా తెలియజేస్తున్నాను. అక్కచెల్లెమ్మల కోసం వారి ఆశీస్సులను కోరుతూ వారికి సంబంధించిన పొదుపు సంఘాల్లో ఉన్న అక్కచెల్లెమ్మల కోసం సున్నావడ్డీ తిరిగి జమ చేయడం కోసం అమలాపురం వచ్చాను. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న దాదాపు 1.05 కోట్లమంది అక్కచెల్లెమ్మలు తీసుకున్న బ్యాంక్ రుణాల మీద సున్నావడ్డీని ప్రతి ఏటా క్రమం తప్పకుండా వరుసగా నాల్గవ ఏడాది కూడా విడుదల చేస్తున్నాం. 9,48,122 పొదుపు సంఘాల గ్రూపులు తీసుకున్న రుణాల మీద అక్షరాల 1,05,13,365 మంది అక్కచెల్లెమ్మలకు మేలు చేస్తూ, వారి కట్టిన రుణాలకు సంబంధించిన వడ్డీని రూ.1354 కోట్లను నేరుగా ఆ అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుంది. ఈరోజు మనం జమ చేసే 1354 కోట్ల రూపాయలతో కలిపి ఈ నాలుగు సంవత్సరాల కాలంలో నా అక్కచెల్లెమ్మలకు కేవలం సున్నావడ్డీ పథకం ద్వారా మాత్రమే అక్షరాల రూ.4,969 కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మలకు ఇవ్వడం జరిగిందని సగర్వంగా మంచి అన్నగా, తమ్ముడిగా తెలియజేస్తున్నాను. ఇది మన చరిత్ర అయితే..

గత ప్రభుత్వంలో 2014%--%19 మధ్య అప్పట్లో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణాలన్నీ కూడా పూర్తిగా మాఫీ చేస్తానని చంద్రబాబు చెప్పాడు. అక్షరాల రూ.14,205 కోట్లు చెల్లించకుండా మోసం చేసి అక్కచెల్లెమ్మలను నడిరోడ్డుపై నిలబెట్టాడు. రూ.14,205 కోట్లు చెల్లించకుండా చేసిన మోసం ఒకటైతే.. 2016లో అక్కచెల్లెమ్మలకు కట్టాల్సిన సున్నావడ్డీ అనే పథకాన్ని రద్దు చేయడం మరో దారుణం. ఇలా అక్కచెల్లెమ్మలకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా మోసం చేసి, 2016 అక్టోబర్ నుంచి రద్దు చేసి అక్కచెల్లెమ్మలను నడిరోడ్డు మీద నిలబెట్టిన పరిస్థితి చంద్రబాబు హయాంలో జరిగిన ఘోరాన్ని తలుచుకుంటే బాధ అనిపిస్తోంది.

చంద్రబాబు చేసిన మోసానికి పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు ఏగ్రేడ్, బీగ్రేడ్ సంఘాలన్నీ సీ, డీ గ్రేడ్‌లకు దిగజారిపోయాయి. 2016 అక్టోబర్ నుంచి సున్నావడ్డీ కింద ఇవ్వాల్సిన సొమ్మును కూడా ఇవ్వకపోవడంతో ఆ అక్కచెల్లెమ్మలు ఎదురువడ్డీ కట్టాల్సిన సొమ్ము అక్షరాల రూ.3,036 కోట్లు. ఇలా పొదుపు సంఘాలను చంద్రబాబు మోసం చేసినందుకు అప్పులన్నీ తడిసిమోపెడై 2019 ఏప్రిల్ నాటికి అక్షరాల రూ.25,571 కోట్లకు ఎగబాకాయి. చంద్రబాబు చేసిన మోసానికి 2019 ఏప్రిల్ నాటికి 18.36 శాతం అక్కచెల్లెమ్మలు తీసుకున్న రుణాలన్నీ మొండి బకాయిలుగా ఎన్‌పీఏలుగా తేలాయి. అటువంటి దారుణమైన 2014%--%19 మధ్య పరిస్థితిని గుర్తుకు తెచ్చుకోమని ప్రతి అక్కచెల్లెమ్మను కోరుతున్నాను. అది నారా వారి చరిత్ర, అది నారీ వ్యతిరేక చరిత్ర అని ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలని అందరినీ కోరుతున్నాను.

మనందరి ప్రభుత్వం, మీ బిడ్డ ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు తోడుగా నిలబడింది. మన ప్రభుత్వం రాగానే వైయస్ఆర్ ఆసరా తీసుకువచ్చాం. ఆసరా, సున్నావడ్డీ, చేయూత ఇలా ఇచ్చిన ప్రతీ మాట నెరవేర్చుకుంటూ అడుగులు వేస్తున్న ఈ ప్రభుత్వం వల్ల పొదుపు సంఘాల్లో మొండి బకాయిలు ఎంతంటే కేవలం 0.3 శాతం. బాబు హయాంలో ఎక్కడ 18.36 శాతం, మన ప్రభుత్వంలో ఎక్కడ 0.3 శాతం అన్నది ఒక్కసారి ఆలోచన చేయండి. ఈ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల పనితీరు దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అక్షరాల 99.67 శాతం రికవరీ రేటుతో దేశానికే మన అక్కచెల్లెమ్మలు ఆదర్శంగా నిలుస్తున్న పరిస్థితి మీ బిడ్డ పరిపాలన జరుగుతుందని సగర్వంగా తెలియజేస్తున్నాను.

మనందరి ప్రభుత్వం ఏర్పడకముందు పొదుపు సంఘాల్లోని అక్కచెల్లెమ్మలు దాదాపు 90 లక్షల మంది అయితే.. ఈరోజున అక్కచెల్లెమ్మలు ప్రభుత్వం మీద నమ్మకంతో, చేస్తున్న మంచిని గమనించి కోటి 16 లక్షల మంది పొదుపు సంఘాల్లో ఉన్నారంటే.. అక్షరాల 25 లక్షల పైచిలుకు మంది పొదుపు సంఘాల్లో చేరి ప్రభుత్వం ఎంతబాగా పనిచేస్తుందో నిదర్శంగా నిలబడ్డారు.

మనం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.3 లక్షల రుణం వరకు మనం ఇచ్చే సున్నావడ్డీతో పాటు మిగిలిన రుణాలన్నీ కూడా బ్యాంక్‌ల నుంచి అతితక్కువ వడ్డీకే అంటే గతంలో 12 నుంచి 14 శాతం వసూలు చేస్తున్న పరిస్థితులు ఉండేవి. దీనిపై బ్యాంక్‌ల ప్రతినిధులతో మాట్లాడి కన్వీన్స్ చేశాం. ఏకంగా ఆ రుణాల మీద వడ్డీని కూడా 8.5 నుంచి 9.5 శాతానికి తగ్గించగలిగాం. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. 2019 ఎన్నికల నాటికి రాష్ట్రంలో పొదుపు సంఘాలకు ఉన్న 25,571 కోట్ల రుణాలను మొత్తం నాలుగు విడతల్లో వారి చేతికే ఇస్తామని మాటిచ్చి మేనిఫెస్టోలో చెప్పాం. ఇచ్చిన మాట ప్రకారం మీ బిడ్డ ఇప్పటికే మూడు పర్యాయాల్లో ఇప్పటికే రూ.19,178 కోట్లు ఆసరాగా అక్కచెల్లెమ్మల చేతుల్లో పెట్టాం. అప్పుల ఊబిలో నుంచి బయటకు తీసుకువచ్చి అక్కచెల్లెమ్మలను సంతోషంగా వారి కాళ్లమీద వారిని నిలబెట్టగలిగాం.

మహిళా పక్షపాత ప్రభుత్వంగా ఈ 50 నెలల కాలంలో మనం అమలు చేసిన పథకాల వివరాలు..

జగనన్న అమ్మ ఒడి ద్వారా అక్షరాల 44.48 లక్షల మంది నా చెల్లెమ్మలకు నాలుగేళ్ల కాలంలో రూ.26,067 కోట్లు ఇచ్చాం. దేశ చరిత్రలోనే ఇలాంటి పథకం మరే ఇతర రాష్ట్రంలో కూడా లేదని సగర్వంగా, సవినయంగా తెలియజేస్తున్నాను.

వైయస్ఆర్ చేయూత పథకం ద్వారా 45%--%60 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అక్కచెల్లెమ్మలకు 26.39 లక్షల మందికి అందించిన సాయం రూ.14,129 కోట్లు అని సవినయంగా, సగర్వంగా తెలియజేస్తున్నాను. గతంలో ఏ ఒక్క ప్రభుత్వం ఇలాంటి పథకాన్ని అమలు చేయలేదు, ఏ ఇతర రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదు.

నా అక్కచెల్లెమ్మలు బాగుండాలనే తలంపుతో వైయస్ఆర్ కాపు నేస్తం తెచ్చాం. 3.56 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు అందించిన సాయం రూ.1518 కోట్లు. గతంలో ఏ ఒక్క ప్రభుత్వమూ ఇలాంటి పథకాన్ని అమలు చేయలేదు, ఏ ఇతర రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదు.

వైయస్ఆర్ ఈబీసీ నేస్తం తీసుకువచ్చాం. ఆ పథకం ద్వారా 4.39 లక్షల మంది నా అక్కచెల్లెమ్మలకు అందించిన సాయం రూ.1257 కోట్లు. గతంలో ఏ ఒక్క ప్రభుత్వమూ ఇలాంటి పథకాలను అమలు చేసిన పరిస్థితులు లేవు, ఏ ఇతర రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం ఎక్కడా లేదు.

వైయస్ఆర్ ఆసరా ద్వారా 80 లక్షల మంది నా అక్కచెల్లెమ్మలకు అందించిన సాయం అక్షరాల రూ.19,178 కోట్లు అని సగర్వంగా తెలియజేస్తున్నాను.

అక్కచెల్లెమ్మలు బాగుండాలి. వారి కాళ్ల మీద వారు నిలబడాలంటే అప్పులు అతి తక్కువ వడ్డీకే అందుబాటులోకి రావాలని పరితపించి వైయస్ఆర్ సున్నావడ్డీని తీసుకువచ్చాం. అక్షరాల ఈ పథకం ద్వారా 1,05,13,365 మంది నా అక్కచెల్లెమ్మలకు ఈ నాలుగు సంవత్సరాల కాలంలో సున్నావడ్డీ కింద ఇచ్చిన సాయం అక్షరాల రూ.5 వేల కోట్లు.

నా అక్కచెల్లెమ్మలు బాగుండాలి, వారి పిల్లలు ఇంకా బాగుండాలి. పేదరికం నుంచి అక్కచెల్లెమ్మల కుటుంబాలు బయటపడాలంటే ఆ పిల్లలు బాగా చదవగలిగితేనే బయటపడతారని ఆ పిల్లలను చదివించడం కోసం ఏ అక్క, ఏ చెల్లెమ్మ కూడా అప్పులపాలు కాకూడదని దేశంలో ఎక్కడా జరిగని విధంగా, రాష్ట్రంలో ఎప్పుడూ చూడని విధంగా జగనన్న విద్యా దీవెన తీసుకువచ్చాం. 26.99 లక్షల మంది నా అక్కచెల్లెమ్మలకు మేలు చేస్తూ.. ఆ పిల్లలకు చదువులకు అయ్యే ఖర్చు పూర్తిగా వంద శాతం ఫీజురీయింబర్స్‌మెంట్ కింద అందిస్తున్నాం. అక్షరాల రూ.10,636 కోట్లు నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాం.

బాబుకు బానిస.. ఫక్తు రాజకీయ వ్యాపారి పవన్

- మొదటి పేజీ తరువాయి

తాపత్రయం గానీ.. తనపార్టీ తాలూకూ భవిష్యత్తును కాపాడుకోవాలనే లక్ష్యం ఎక్కడా వినిపించడంలేదన్నారు. వారాహి పేరుతో ఒక లారీ ఎక్కి మూడోవిడత యాత్ర అంటూ పవన్‌కళ్యాణ్ ఊగిపోతూ ప్రసంగిస్తున్నాడని, లక్ష్యం, సిద్ధాంతం, వ్యక్తిత్వం లేని వ్యక్తి అసత్య ఆరోపణలతో ఆవేశపడి ఊగిపోయినంత మాత్రానా నాయకుడు కాలేడనేది పవన్ తెలుసుకోవాలని సూచించారు. ఒక కథానాయకుడిగా సినిమాల్లో ఏ వేషాలైనా వేసి తాను కలలుగనే లక్ష్యాన్ని చేరుకోవచ్చు.. అంతేగానీ ప్రజాక్షేత్రంలో పోరాడి ప్రజలు మెచ్చిన నేతగా ఉన్న సీఎం వైయస్ జగన్‌ని ఓడించాలనుకోవడం సాధ్యం కాని విషయమని అర్థం చేసుకోవాలన్నారు. విశాఖలోని సర్క్యూట్‌హౌస్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన ఇంకేం మాట్లాడారంటే..

పవన్ బానిసత్వానికి జాలిపడాలి

నాయకుడిగా నిలబడాలంటే మనం నమ్మిన వారిని.. మనల్ని నమ్మేవారిని కాపాడుకోగలగాలి. ఇక్కడ పవన్‌కళ్యాణ్ మాత్రం తనను అభిమానించే అభిమానులను కాదని.. తాను నమ్ముకున్న దత్తతండ్రి చంద్రబాబుకు బానిసగా బతుకుతున్నాడు. బాబు ఇచ్చిన ప్యాకేజీ ఫీడ్‌తో స్క్రిప్టులు పట్టుకుని రోడ్లమీదికొచ్చి ఊగిపోతున్నాడు. ఆయన మాట్లాడే ప్రతీ మాట వెనుకనున్న అంతరార్థం, తన యజమానికి పనిచేసి పెట్టాలన్న పవన్ బానిసత్వానికి ప్రతీ ఒక్కరూ జాలిపడాల్సిందే.

అల్పుడెపుడు పల్కు .. అంటూ వేమన పద్యం చూస్తే..

పవన్‌కళ్యాణ్‌కు, గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి మధ్య వ్యత్యాసాన్ని యోగి వేమన ఎప్పుడో చెప్పారు. 'అల్పుడెప్పుడు పలుకు నాడంబరముగాను.. సజ్జనుండు పలుకు చల్లగాను, కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా.. విశ్వదాభిరామ వినురవేమ' అని ఆ మహానుభావుడు వేమన పద్యం రాశారు. ఏమీలేని ఆకు ఎగిరెగిరి పడిందని.. అన్నీ ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటుందనే నానుడిని కూడా పెద్దలు చెబుతారు. పవన్‌కళ్యాణ్‌లాంటోళ్ల కోసమే ఇలాంటి సామెతలు, నానుడులు పలుకుతారు.

సంసారం బీజేపీతో.. సహజీవనం టీడీపీతోనా..?

పవన్ కల్యాణ్ 15 ఏళ్ల కిందట రాజకీయాల్లోకొచ్చాడు. చిరంజీవి ప్రజారాజ్యం పెట్టినప్పుడు యువరాజ్యం అధ్యక్షుడిగా రాజకీయ అరగేట్రం చేసిన నువ్వు.. ఆ తర్వాత జనసేన పార్టీ పెట్టి పదేళ్లలో ఏం సాధించావు..? నీకు ఒక విధానం, సిద్ధాంతం, లక్ష్యం, స్థిరత్వం లేదు. ఒకపక్క విప్లవవాదినంటావు. మరోపక్క బీజేపీతో కలిసి పనిచేస్తున్నానంటావు. 2014 నుంచి 2023 వరకు గడచిన 9 ఏళ్లుగా దాదాపు ఆరేడు పార్టీలతో పొత్తులు పెట్టుకున్నావు. వాటిల్లో ఒక పార్టీకి మరో పార్టీకి విధానాలు కలవవు. లక్ష్యాలు, సిద్ధాంతాలు వేరుగా ఉన్న పార్టీలతో కలిసి పనిచేస్తావు. 2014లో తెలుగుదేశం, బీజేపీతో పొత్తు.. అదే 2019 ఎన్నికలు వచ్చేసరికి సీపీఐ, సీపీఎం, బీఎస్పీలతో పొత్తు పెట్టుకున్నావు. 2019లో ఓడిన తర్వాత కొన్నాళ్లకు మళ్లీ బీజేపీతో కలుస్తావు. ఇప్పుడు సంసారమేమో బీజేపీతో సహజీవనమేమో తెలుగుదేశం పార్టీతో చేస్తున్నావు. ఇది పవన్‌కళ్యాణ్ తాలూకా రాజకీయ వ్యక్తిత్వమని చెప్పుకోవాలి.

సీఎం వైయస్ జగన్‌ను ఆదర్శంగా తీసుకో..

పవన్‌కళ్యాణ్ తీరును చూస్తుంటే చాలామందికి జాలేస్తుంది. ఇన్నాళ్లు సినిమా ఇమేజ్‌తో ఉన్న అతను తన రాజకీయ ప్రసంగాలతో ఉన్న గౌరవాన్ని కోల్పోతున్నాడని అతని ఫ్యాన్ కూడా బాధపడుతున్నారు. మొదట్నుంచి గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌పై అసూయ, ద్వేషం, ఆక్రోశంతో విమర్శలు చేయడమే పవన్ కల్యాణ్ పనిగా పెట్టుకున్నాడు. చిన్న వయసులో వైయస్ జగన్ అనే నాయకుడు రాజకీయాల్లో అనేక ఆటుపోట్లు ఎదుర్కొని రాష్ట్ర చరిత్రలో ముందెన్నడూ ఎరుగని విధంగా 151 స్థానాల్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రి అయ్యారనే సంగతిని గుర్తెరగాలని .. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని అనుకోలేదు. మరి, సీఎం వైయస్ జగన్ పవన్‌కళ్యాణ్ మాదిరిగా సినిమా నటుడు కాదు. ఆయనకున్న సినిమా ఇమేజ్ లేని వ్యక్తి. రాజకీయాల్లో నడవడమంటే సినిమాల్లో చేసే యాక్టింగ్ కాదు. ప్రజల మధ్య నిలబడి ప్రజల తాలూకూ బాధలు, కష్టాల్ని చూసి ప్రాంతాల నడుమ పరిస్థితుల్ని, ఇబ్బందుల్ని పూర్తిగా అధ్యయనం చేయడం, ఈ వ్యక్తిని నాయకుడిగా ఎన్నుకుంటే తమ కష్టాల్ని తీరుస్తాడనే ప్రజలకు నమ్మకం కలిగించడం. ఈ విషయాలన్నింటిపై రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది ప్రజలు వైయస్ జగన్‌ని నమ్మారు కాబట్టే ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో ఎదగడానికి ప్రయత్నించకుండా ప్రతీక్షణం సీఎం వైయస్ జగన్‌ని విమర్శిస్తేనో.. దుయ్యబడితోనే పవన్‌కళ్యాణ్ ఏమీ సాధించదు.

175 స్థానాల్లో పోటీ చేయవు.. సీఎం ఎలా అవుతావు..?

పవన్‌కళ్యాణ్ మైకుపట్టుకుంటే వైయస్ జగన్ అధికారం నుంచి దిగిపోవాలంటాడు. మరి, ఎవరు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నావు..? నువ్వా..? 175 నియోజకవర్గాలకు 175 చోట్ల జనసేన పోటీ చేస్తుందా..? నిన్న విశాఖపట్నం బహిరంగ సభ ప్రసంగంలో ఆ ప్రస్తావనేమీ తేలేదు. మరి, 'చంద్రబాబు నీ చెవిలో నాకొడుకు లోకేశ్‌ను పక్కనబెట్టి నిన్నే ముఖ్యమంత్రిని చేస్తాను పవన్..' అంటూ నీకేమైనా చెప్పాడా..? అందుకేనా.. చంద్రబాబు అందించిన స్క్రిప్టును అక్షరం పొల్లుపోకుండా చదువుతున్నావు. కేవలం.. నువ్వు పనిచేసేది, ప్రసంగించేది చంద్రబాబు అధికారం కోసమే కదా..? ఇదికూడా కాదంటే.. ఆనాడు ఎన్టీరామారావును వెన్నుపోటు పొడిచి అధికారం లాక్కున్న చంద్రబాబు విధానాన్నే ఆదర్శంగా తీసుకుని నువ్వు గెలిచాక, ఆయన్నే వెన్నుపోటు పొడుద్దామనుకుంటున్నావా..? అలా చేయాలన్నా.. నువ్వు ఎక్కడా గెలిచే పరిస్థితీ కనిపించడం లేదు. అయితే, ఊగిపోయే లారీ ప్రసంగాలేంటి..? ఈ ప్రశ్నలపై ప్రజలకు పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలి.

కల్వకుంట్ల కుటుంబం చేస్తున్న లూటీని దేశం చూస్తోంది

- మొదటి పేజీ తరువాయి

సంజయ్ శుక్రవారం ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. ప్రజలను దోచుకోవడం ద్వారా కల్వకుంట్ల కుటుంబ ఆదాయం ఎలా పెరిగిందనేది కూడా ప్రజలు చూస్తున్నారు, అందుకే ట్విట్టర్ టిల్లు కుటుంబం వణికిపోతోందని బండి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో పైకి శత్రువులుగా నటిస్తూ ఢిల్లీలో మాత్రం దోస్తీ చేస్తున్నారని సంజయ్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లేనని ఆయన మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఇన్నిరోజులు విస్మరించిన సర్కార్.. కేవలం ఎన్నికలు వస్తున్నాయనే ఉద్దేశ్యంతో ప్రభుత్వంలో విలీనం చేసిందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం స్పందించలేదని, రైతులు, యువత, 317 జీవో ద్వారా టీచర్లు ఇబ్బందులు పడినా ఏనాడూ ఈ సర్కార్ పట్టించకున్న పాపాన పోలేదన్నారు.

ధనిక రాష్ట్రమని చెబుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఎందుకివ్వలేకపోతున్నారని బండి ప్రశ్నించారు. మిషన్ భగీరథ నిధులు దుర్వినియోగం చేశారని, అలాగే మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్రం కేటాయించిన నిధులను సైతం దొంగిలించారని ఆయన ఆరోపణలు చేశారు. పేదలకు మోడీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం కోసం డబ్బులు ఎలా వసూలు చేశారని బండి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులకు కేటాయించిన నిధులను సైతం దారిమళ్లించిన సర్కార్.. కేసీఆర్ ది అని విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఎందుకు సహకరించడంలేదో సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై ఇంకెన్ని అబద్ధాలు చెబుతారని బండి సంజయ్ మంత్రి కేటీఆర్‌ను ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు.

గ్రూప్ 2 వాయిదాపై ఆగస్టు 14న ఫైనల్ డెసిషన్

- మొదటి పేజీ తరువాయి

రకాల 21 పోటీ పరీక్షలు జరుగుతున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 29, 30 న గ్రూప్ 2 కూడా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో గ్రూప్ 2 పరీక్ష రాయడం అభ్యర్థులకు ఇబ్బంది అని వివరించారు. ప్రభుత్వం అభ్యర్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేయాలని కోరారు. గ్రూప్ 2 కోసం 5.5 లక్షలు మంది అప్లై చేసుకున్నారని.. ఇందులో 90 శాతం మంది పోస్ట్ పోన్ చేయాలని కోరుతున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది వివరించారు. గ్రూప్ 2 రాసే అభ్యర్థులు మిగిలిన పరీక్షలు కూడా రాస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టుకు విన్నవించారు.

గ్రూప్ 2 పరీక్షకు 5.5 లక్షలు మంది దరఖాస్తు చేసుకున్నారు కానీ, గురుకుల పరీక్షకు 60 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని %యూరాజ% కౌన్సిల్ తెలిపింది. ఇప్పటికే గ్రూప్ 2 పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశామని.. 1535 సెంటర్ లలో పరీక్షలు జరిగే స్కూల్, కాలేజ్ లకు సెలవులు ప్రకటించామని పేర్కొంది. అయితే గ్రూప్ 2 పరీక్షల అభ్యర్థులు 5.5 లక్షల మంది ఉంటే అందులో 150 మంది మాత్రమే పిటిషన్ వేశారని %యూరాజ% కౌన్సిల్ తెలిపింది. గ్రూప్ 2 పరీక్ష వాయిదాపై 2023 ఆగస్టు 14న (సోమవారం) నిర్ణయం ప్రకటిస్తామని హైకోర్టుకు %యూరాజ% తరపున న్యాయవాది తెలిపారు. అయితే ఫైనల్ గా సోమవారం గ్రూప్ 2 పరీక్షపై తుది నిర్ణయం తీసుకోవాలని %యూరాజ%కి హైకోర్టు ఆదేశించింది. దీంతో ఈ పిటీషన్ పై తదుపరి విచారణను హైకోర్టు ఆగస్టు 14 (సోమవారం)కు వాయిదా వేసింది.

ఇదేం నివేదిక..

- మొదటి పేజీ తరువాయి

చేసిన నివేదిక కూడా అసంపూర్తిగా ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ పేర్కొన్నారు. ఇరు వర్గాల వాదనలు విన్న హైకోర్టు అంటువ్యాధులతో భాదపడుతున్న వారి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. చనిపోయిన 49 మందికి ఎంత నష్ట పరిహారం చెల్లించారో సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొంది. తదుపరి విచారణ వచ్చే గురువారానికి వాయిదా వేసింది.

3 రోజుల్లో 2 వేల దరఖాస్తులు..

- మొదటి పేజీ తరువాయి

ఈసారి మద్యం టెండర్లకు భారీ పోటీ నెలకొందని చెబుతున్నారు. దరఖాస్తు ఫీజు కింద (నాన్ రిఫండబుల్) రూ.2 లక్షలు వసూలు చేస్తున్నా వ్యాపారులు వెనక్కి తగ్గడంలేదన్నారు. గత నోటిఫికేషన్ లో దరఖాస్తు ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ.1,350 కోట్ల ఆదాయం సమకూరిందని, ఈసారి ఇంకా పెద్ద మొత్తమే ప్రభుత్వ ఖజానాకు చేరనుందని భావిస్తున్నారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయని అధికారులు చెప్పారు. ముఖ్యంగా కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ లో మద్యం షాపుల టెండర్లకు చాలామంది పోటీపడుతున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,620 మద్యం షాపులు ఉండగా.. ఇప్పటికే 2 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, రాబోయే రోజుల్లో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 18 సాయంత్రం 6 గంటలకు టెండర్ దాఖలు గడువు ముగుస్తుందని, 21న లాటరీ విధానంలో మద్యం షాపులు కేటాయిస్తామని అధికారులు వివరించారు.

రాష్ట్రమంతా రావాలి జగన్.. మళ్లీ కావాలి జగన్ అంటోంది

- మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన పెన్షన్లు 30 లక్షలు అయితే సీఎం వైయస్ జగన్ దాదాపు 63 లక్షల మందికి ఇస్తున్నారని చెప్పారు. వైయస్ జగన్ సీఎం అయిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేశారని, వైద్య ఆరోగ్య శాఖలోనూ ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. ఏపీలో ఒక నాయకుడు హలో ఏపీ బైబై వైసీపీ అంటున్నాడు, ఎందుకు బైబై చెప్పాలి, అమ్మ ఒడి ఇస్తున్నందుకా..? లేక సంక్షేమ పథకాలు పారదర్శకంగా ఇస్తున్నందుకా..? అని ప్రశ్నించారు. ఏపీ ప్రజలంతా రావాలి జగన్ మళ్లీ కావాలి జగన్ అంటున్నారని మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు.

సోనియాగాంధేయే ఏం చేయలేకపోయింది..

జగన్‌ను నువ్వేం చేస్తావ్?

- మొదటి పేజీ తరువాయి

నిన్నటి మీటింగ్‌లో జగన్‌పై విమర్శలు చేశారని, అమిత్ షాకు చెప్పి జగన్‌ను ఆటాడిస్తానని చెబుతున్నాడని, కానీ తన సినిమాను ఆడించుకోలేక చతికిలపడ్డ జనసేనాని జగన్‌ను ఆడిస్తాడా? అని ఎద్దేవా చేశారు. జగన్‌ను ఆడించడం... ఓడించడం దేశాన్నే గడగడలాడించిన సోనియా గాంధీ వల్లే కాలేదన్నారు.

%ఈ రాజకీయ ఆటలో నువ్వు అరటిపండు.. అలాంటిది నువ్వేం చేస్తావని ధ్వజమెత్తారు. చంద్రబాబు, పచ్చ ఛానళ్లు ఇచ్చే అబద్ధాలు పవన్ మాట్లాడుతారన్నారు. సినిమాల్లో రీమేక్‌లు సక్సెస్ కావొచ్చునేమో.. కానీ రాజకీయాల్లో రీమేక్‌లు సక్సెస్ కావని విమర్శించారు. చంద్రబాబు మాట్లాడిందే పవన్ మాట్లాడుతారని, ఈనాడు, ఆంధ్రజ్యోతిలలో వచ్చిందే చెబుతారన్నారు. జనసేనానికి ఓ జెండా, అజెండా లేవన్నారు. ప్రజారాజ్యం, జనసేన పార్టీలు వచ్చి పదిపదిహేనేళ్లవుతున్నాయని, కానీ నమ్ముకున్న వారి కోసం ఇది చేశామని చెప్పే పరిస్థితి లేదన్నారు. పవన్ మాట్లాడితే చాలు చంద్రబాబుకు ఓటేయమన్నట్లుగా మాట్లాడుతున్నారన్నారు. మీ తల్లిని, మీ కార్యకర్తలను, మీ జనసేన పిల్లసేనల్ని తిడితే కనీసం పట్టించుకోలేదని, కానీ ప్యాకేజీ కోసం లొంగుతారన్నారు. బాలకృష్ణ ఇంటర్వ్యూ కోసం వెళ్తారు... చంద్రబాబు ఇంటికి వెళ్తారు... టీడీపీకి ఓటు వేయమని చెబుతారు.. ఇదేనా రాజకీయం? అన్నారు. దత్తపుత్రుడు ఎలా తయారయ్యాడంటే మొరగమంటే మొరుగుతున్నాడు.. కరవమంటే కరుస్తున్నాడని విమర్శించారు. ఒక వింత జీవిలా తయారయ్యాడన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలోజిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా

శుభ తెలంగాణ :ఈరోజు రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో లక్షలాదిమంది నిరుద్యోగ అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్2 పరీక్షను 3 నెలల సమయం ఇచ్చి తరువాత పరీక్ష నిర్వహించాలని కేసీఆర్ ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగులకి ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ:3016 ఇప్పటివరకు ఒక్కొక్కరికి 1,68,896 చెల్లించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం
చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పోలీసుల అక్రమంగా అరెస్టు చేసారు,ఈ కార్యక్రమంలో బీజేవైఎం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

సోమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.17,21,328..

శుభ తెలంగాణ :పాలకుర్తి మండల కేంద్రంలోని స్వయంభువు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.17,21,328 వచ్చినట్లు ఈఓ భాగం.లక్ష్మీ ప్రసన్న తెలిపారు.
2023 మార్చి 16 నుంచి 2023 ఆగస్టు 11వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, 150 రోజుల ఆదాయాన్ని ఆలయం కళ్యాణమండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ భువనగిరి ఇన్స్పెక్టర్ బి.సుమతి పర్యవేక్ష ణలో లెక్కించారు.
అమెరికా కరెన్సీ నోట్లు 26 (291డాలర్లు), సింగపూర్ చెందిన 1(2డాలర్లు) కరెన్సీ నోట్లు వచ్చిన్నట్లు ఈఓ తెలిపారు.
హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు, కే.నరసింహారెడ్డి, ధరావత్.యాకుబ్ నాయక్, చిదురాల.సంధ్యారాణి, ధనుంజయ, సిబ్బంది, మహబూబాద్ చెందిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటికి పెద్దన్నగా కేసీఆర్

- ఆడబిడ్డల పెండ్లికి మేనమామ కట్నంగా కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు
- పాలకుర్తి నియోజకవర్గ స్థాయిలో 99 మందికి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి

శుభ తెలంగాణ :తెలంగాణ రాష్ట్రంలో పేదింటి పెద్దన్నగా సీఎం కేసీఆర్ నిలిచిపోయారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ స్థాయిలో 99 మంది పేదింటి ఆడబిడ్డలకు పాలకుర్తి లో గల క్యాంపు కార్యాలయంలో మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఆడబిడ్డ పెండ్లికి మేనమామగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందచేస్తున్న ఘనత సీఎం కెసిఆర్ దేనని అన్నారు. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడ లేదని ఇలాంటి సంక్షేమ పథకాలను అందచేస్తున్న ఘనత బీ ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజల కోసమే పనిచేస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం కెసిఆర్, బీ ఆర్ ఎస్ పార్టీకి మనమంతా రుణపడి ఉండాలి అన్నారు. మరోసారి బీ ఆర్ ఎస్ పార్టీని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకి విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా కు అంతరాయం: ఏ ఈ రమేష్ బాబు

శుభ తెలంగాణ :పొన్నలురు విద్యుత్ కేంద్రం లో పనులు జరుగుతున్న భాగంగా ఆగస్ట్12వ తేదీ శని వారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది అని పొన్నలురు ఏ ఈ రమేష్ బాబు తెలిపారు. పొన్నలురు మండలంలోని గృహ వ్యాపార, పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కబ్జా భూములపై ఎమ్మార్వో కి ఫిర్యాదు చేసిన కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు.


KOMPALLY MUNICIPAL CONGRESS COMMITTEE
Bairy Prashanth Goud
President
Date: 11-08-23
The M.R.O.,
Dundigal- Gandimaisamma Mandal,
Telangana State.
Sub :- Encroachment of FOX SAGAR Nala at Kompally Municipality.
Respected Sir,
I, BAIRY PRASHANTH GOUD, President of Congress Party, Kompally Municipality, in our Municipality limits near Sagar Intervention Centre, Sy. No.117, 118, 119, some private persons are encroaching the nala with Mud or Dust Particulars, and planned to convert the nala into use for Commercial purpose and sale and make money. In these issue we have been represented a letter dt. 12-07-2023 to M.R.O., Dundigal copy enclosed herewith, Revenue officers, Police, MRO, office and Irrigation Department Officers visited the Nala Land and demolished the unauthorized constructions with JCB's, but soon after 3-4 days the construction works started by the encroachers, till the date the situation is same. The same issue has been published in the PEN POWER PAPER as (Fox Sagar Kaluva pai Mukhyala Charyalu) on dated : 07-08-2023.
So please kindly look into this matter and take necessary action against the encroachers and demolish the unauthorized construction in Fox Sagar Nala and save the Nala Land for future generations.
Encl.:-
1. Fox Sagar Map
2. Village Map
3. Paper Articles
4. Unauthorized Construction Photos
5. Copy of representations letter enclosed.
Yours faithfully,
BAIRY PRASHANTH GOUD
H.No. 6-115, Opp Municipal Office, Kompally, Medchal - Malkajgiri (District), Telangana - 500014.

శుభ తెలంగాణ : కొంపల్లి మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూములు అన్యకాంతం అవుతున్నాయని కబ్జా కొరులు ఇష్టానుసారం మట్టితో చదును చేసి ప్రభుత్వం భూములను కబ్జా చేస్తున్నారని స్థానిక ఎమ్మార్వోకు కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రాన్ని అందజేసినారు. వివరాల్లోకి వెళ్ళితే కొంపల్లి మున్సిపాలిటీలోని ఫాక్స్ సాగర్ ప్రాంతంలోని ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా దుండిగల్ గండి మైసమ్మ మండలంలోని తాసిల్దార్ కి నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని దీనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోను కోరినట్లుగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలోని మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ ఇబ్రహిం,మాజీ వార్డ్ సభ్యులు కావలి గోపాల్,నవీన్ ముదిరాజ్,సన్న వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేయి తడపాల్సిందేనా..?

- రెవెన్యూలో ఆగని అవినీతి
- నేటికీ కొనసాగుతున్న పాత వాసన
- కనిగిరి మండలం ఏరువారిపల్లి వి ఆర్ ఓ వేణుగోపాల్ రెడ్డి
- కొందరికి తలకెక్కని సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు

శుభ తెలంగాణ కనిగిరి ఆగస్ట్11:
తాజాగా కనిగిరి మండలం పాసు పుస్తకం మంజూరు కోసం ఏరువారిపల్లి గ్రామానికి చెందిన రైతు నుంచి రూ. 21వేలు లంచం తీసుకుండగా వీఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
వీరు దొరికినోళ్లు.. మరి దొరకనివాళ్లు.. చాలా మంది ఉన్నారనేది ప్రజల మాట. రెవెన్యూ అంటేనే అవినీతికి చిరునామా అని జనం అంటున్నారు. ఈ శాఖలో గతంలో అవినీతి యథేచ్ఛగా సాగింది. సిబ్బంది దగ్గరి నుంచి అప్పటి మంత్రుల వరకూ అవినీతిలో భాగస్వాములు కావడంతో పట్టించుకున్న దాఖ లాల్లేవు. అవినీతి విశృంఖలం అయిపోయింది. ఇప్పుడా పరిస్థితి మారింది. పాలకులు అవినీతికి దూరంగా ఉంటున్నారు. నిజాయితీతో కూడిన పాలన కోసం పరితపిస్తున్నారు. అవినీతి వ్యవహారాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. 'రెవెన్యూలో పరిస్థితి మారాలి. అవినీతికి ఆస్కారం ఉండకూడదు. మీకేమైనా సమస్యలు, ఇబ్బందులుంటే నాకు వదిలేయండి. నేను చూసుకుంటాను. అంతే తప్ప అవినీతికి పాల్పడకూడదు. చెప్పినా కూడా చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు. చర్యలు గతం కన్నా కఠినంగా ఉంటాయి. ఒక్కసారి ఉద్యోగానికి ఇబ్బంది వచ్చిందంటే కష్టం. నా హయాంలో పైరవీలకు అవకాశం ఉండదు.' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరుచూ అధికారులకు చెబుతూ వస్తున్నారు.
అవినీతి రహిత పాలన అందించాలని, లంచాల్లేని పాల న కొనసాగాలని ఆయన పదేపదే హెచ్చరించడమే కాకుండా హితబోధ చేస్తున్నారు. అయినా కొందరి తలకెక్కడం లేదు. తమ పాత బాణీ కొనసాగిస్తున్నారు. అలవాటు పడిన చేతులతో లంచాలు తీసుకుంటున్నారు. చివరికి అడ్డంగా బుక్ అవుతున్నారు. స్పందన దగ్గరి నుంచి సీఎంఓ కార్యాలయం వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నారు. ఏ ఒక్క ఫిర్యాదునూ విడిచిపెట్టడం లేదు. సీరియస్‌గా తీసుకుని చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూడా అక్రమాలకు పాల్పడితే వారిని దేవుడే రక్షించాలి.

రెవెన్యూలో మామూలేనా?

రెవెన్యూలో అవినీతి సాధారణమైపోయిందని అందులో పనిచేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్న వారే నిరూపించుకుంటున్నారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాల కోసం భూమి విలువ మేరకు రూ. 5వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేస్తున్నారన్న వాదనలు కొనసాగుతూనే ఉన్నా యి. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం సర్టిఫికెట్ (లీగల్ హెయిర్), కొరిలేషన్ సర్టిఫికేట్, మ్యూటేషన్, కరెక్షన్లకు పలుచోట్ల డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ రకమైన ఫిర్యాదులు ప్రతివారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి కూడా వస్తున్నాయి. ఉన్నతాధికారులు కూడా తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఇంత గట్టిగా హెచ్చరిస్తున్నా ఇంకా మారలేదన్న ఆవేదనైతే ఉన్నతాధికారుల్లో కూడా ఉంది. వాస్తవానికైతే ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు మీ సేవలో దరఖాస్తు చేసుకుంటారు. వీఆర్ఓ ప్రాథమిక దర్యాప్తు చేస్తారు. దీని ఆధారంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరిస్తారు. వీరిద్దరి స్టేట్‌మెంట్ సంతృప్తికరంగా ఉంటే తహసీల్దార్ డిజిటల్ కీ ద్వారా ఆమోదం తెలుపుతారు. ఈ ప్రక్రియ కోసం కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

"నా మట్టి - నా దేశం" కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ లోతేటి శివశంకర్

శుభ తెలంగాణ : పల్నాడు ఇంఛార్జ్ ఆగస్టు 12:ఆజాది కా అమృత మహోత్సవ్ -2023 ముగింపు ఉత్సవాలలో భాగంగా చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలో మునిసిపల్ కమీషనర్ సి.హెచ్ గోవింద రావు ఆధ్వర్యము లో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ముఖ్య అతిథి గా పాల్గొని "నా మట్టి - నా దేశం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భముగా కార్యక్రమంలో భాగమైన శిలా ఫలకం ప్రారంభించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వీరులకు వందనం సందర్భముగా రిటైర్డ్ ఆర్మీ అధికారులకు కలెక్టర్ చేతుల మీదగా సన్మానము చేశారు, ఈ కార్యక్రమము లో కలెక్టర్ తో పాటు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ , ట్రైని కలెక్టర్ కల్ప శ్రీ మరియు మునిసిపల్ చైర్మన్ షేక్.రఫాని మరియు జిల్లా అధికారులు, మునిసిపల్ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొని " పంచ ప్రాణ ప్రతిజ్ఞ " చేయడం జరిగినది.

స్కైవాక్ నిర్మాణానికి స్థల పరిశీలన

శుభ తెలంగాణ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం చౌదరిగూడ గ్రామ పరిధిలో వరంగల్ నేషనల్ హై వే లో పోచారం మేధా కంపెనీ రోడ్ జొడిమెట్ల చౌరస్తా లో రహదారి మీద ఇటు నుండి అటు వైపు దాటటానికి ప్రజలు చాలా ఇబ్బంది ప్రమాదానికి గురి అవతున్నరని మేడ్చల్ జిల్లా మంత్రివర్యులు ఛామకుర మల్లా రెడ్డి ద్రుష్టి కి తీసుకెళ్లడం తో వారి ఆదేశానుసారం వరంగల్ నేషనల్ హై వే రహదారి ఏఈ తో చౌదరిగూడ గ్రామ సర్పంచ్ బైరు రమాదేవి రాములు గౌడ్ మరియు పోచారం మున్సిపాలిటీ చైర్మన్ కొండల్ రెడ్డి, ఆధ్వర్యంలో స్కై వాక్ గురించి వారు నేషనల్ హైవే ఏఈ తో స్థలానికి వెళ్లి పరిశీలించి చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమం లో నాయకులు పాలడుగు సందీప్ రెడ్డి, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శకుల సౌకర్యార్థమే ఆల్పాహారం

- హైదరాబాద్, హనుమకొండ, పర్వతగిరి, పాలకుర్తిల్లో ఏర్పాటు
- హనుమకొండ ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

శుభ తెలంగాణ :తన వద్దకు వివిధ పనుల కోసం వచ్చే సందర్శకుల సౌకర్యార్థం ఆల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. హనుమకొండ ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రి వివిధ పనుల మీద పాలకుర్తి నియోజకవర్గం సహా పలు ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల కోసం శుక్రవారం ఆల్పాహారాన్ని స్వయంగా వడ్డించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలకుర్తి నియోజకవర్గం నుంచే గాక, వివిధ పనులపై అనేక మంది తన వద్దకు వస్తున్నారని, వాళ్ళందరికీ ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతోనే ఆల్పాహారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తన వద్దకు వచ్చే వాళ్ళకు ఆల్పాహారం, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. అయితే, ఇందుకు భిన్నంగా పెద్ద మొత్తంలో సందర్శకుల కోసం ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. తాను అందుబాటులో ఉండే, హైదరాబాద్ మంత్రుల నివాసం, హనుమకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహం, పాలకుర్తి క్యాంపు కార్యాలయం, పర్వతగిరిలోని తమ ఇంటి వద్ద ఈ సదుపాయం ఉంటుందని, ప్రజలు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

కడుపు మంటతో అన్న క్యాంటీన్ కు తాళాలు

శుభ తెలంగాణ : (చిలకలూరిపేట)ఆగస్టు 12:పేద ప్రజలకు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా మాజీ మంత్రి ప్రత్తిపాటి తన సొంత నిధులు వెచ్చించి నిరుపేదలకు ఉచితంగా అన్నా క్యాంటీన్ల వద్ద మొబైల్ వాహనంలో అన్నదానం నిర్వహించడం చూసి ఓర్వలేక కడుపు మంటతో స్థానిక మంత్రి విడదల రజిని మున్సిపల్ అధికారులను ఉసిగొలిపి అన్న క్యాంటీన్లకు తాళాలు వేయించడం జరిగిందని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శలు చేశారు. శుక్రవారం నాడు పట్టణంలోని స్థానిక గడియార స్తంభం సెంటర్లో అన్న క్యాంటీన్ వద్ద రోడ్డుపైనే తెలుగుదేశం పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారు ఈ ప్రయత్నంలో టిడిపి నాయకులకు పోలీసులకు వాగ్వాదం చోటుచేసుకుంది ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల వద్ద పేదలకు ఉచితంగా భోజనం అందించాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన ఆదేశాల మేరకు మనందరి అభిమాన నాయకులు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా మాజీ మంత్రి ప్రత్తిపాటి తన సొంత నిధులు వెచ్చించి పేద ప్రజలకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటే మీ కడుపు మంట ఎందుకని ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని నీ సూటిగా ప్రశ్నించారు. అన్నా క్యాంటీన్ల వద్ద మొబైల్ వ్యాన్ తో పేదలకు అన్న దానము చేస్తున్నాము. దుమ్ము పడకుండా ఉండేందుకు గాని ఎండకు తట్టుకోలేక నీడ కోసమని క్యాంటీన్ లలోకి పేదలు వెళుతున్నారని దీన్ని ఓర్వలేని స్థానిక మంత్రి మనస్సాక్షి అనేది లేకుండా తాళాలు వేయడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని. పట్టెడు అన్నం మీరు పెట్టకపోయినా పర్వాలేదు కానీ పెట్టే వారిని పెట్టకుండా అడ్డుకోవడం సంస్కారం కాదని దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారని హితవు పలికారు. ప్రధాన కూడళ్లలో పేద ప్రజలకు ఉచిత అన్నదాన కేంద్రాలుగా నిలవాల్సిన అన్న క్యాంటీన్లు పేకాట మద్యం గంజాయి లాంటి అక్రమ కార్యక్రమాలకు నిలయాలుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రభుత్వాధికారులు ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని అధికారంలో ఉన్నారు కదా అని వారు చెప్పిన అడ్డమైన పనులు చేసుకుంటూ పోతే ఇబ్బంది పడేది మీరేనని అధికారులను ఉద్దేశించి అన్నారు ప్రజాప్రయోజనాలకి అడ్డంకులు ఏంటి తాళాలు ఎందుకు వేశారు సమాధానం చెప్పాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు వెంటనే తాళాలు తొలగించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా రాష్ట్ర పట్టణ మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

పేట మున్సిపాలిటీ సందర్శించిన ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ కె ఆర్

శుభ తెలంగాణ :పల్నాడు ఇంఛార్జ్ ఆగస్టు 12:చిలకలూరిపేట పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంను శుక్రవారం పల్నాడు ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ కె ఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ కె ఆర్ మాట్లాడుతూ ట్రైనింగ్ లో భాగంగా మున్సిపల్ విభాగంలో అన్ని సెక్షన్ పనులను జరుగుతున్న తీరును మరియు పలు రికార్డులను పరిశీలించామని తెలిపారు. గతవారం నరసరావుపేట మున్సిపాలిటీ అన్ని రికార్డులను పరిశీలించాలని ఈ వారం చిలకలూరిపేట మున్సిపాలిటీలోని అన్ని సెక్షన్ లోని పనులు మరియు వాటి రికార్డులను పరిశీలిస్తామని తెలిపారు.

ఇంటర్నేషనల్ షిరిడీ సాయి క్లబ్స్ అసోసియేషన్ సభ్యుడి గా డాక్టర్ పూసపాటి బాలాజీ

శుభ తెలంగాణ :పల్నాడు ఇంఛార్జ్ ఆగస్టు 12:చిలకలూరిపేట శ్రీ దత్త సాయి అన్నదాన సమాజము మరియు జయ జయ్ సాయి ట్రస్ట్ అధ్యక్ష్యుడు సాయి సేవకులు డాక్టర్ పూసపాటి బాలాజీ కి అరుదైన గౌరవం దక్కిందిమహా రాష్ట్ర లోని ఔరంగాబాద్ కి చెందిన ఇంటర్నేషనల్ సంస్థ అయిన షిరిడీ సాయి క్లబ్స్ అసోసియేషన్ లో శాశ్వత సభ్యుడిగా నియమించింది ఈ అసోసియేషన్ ఇప్పటివరకు షిరిడీ నీ కేంద్రం గా చేసుకొని అనేక సేవా కార్యమాలు ను ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువగా చేస్తూ ఉన్నది దక్షణాది రాష్ట్రాలలో కూడా సేవలను విస్తృత పర్చాలని దేశం మొత్తం మీద 100 మంది సభ్యులను ఎన్నుకున్నది ఆంధ్రప్రదేశ్ తరుపున పూసపాటి బాలాజీ చేస్తున్న నిస్వార్థ సేవా కార్య క్రమాలను గుర్తించి శాశ్వత సభ్యుడి గా ఎన్నుకొని మెయిల్ ద్వారా తెలియ చేశారు సెప్టెంబర్ రెండవ వారం లో షిరిడీ లో ప్రమాణ స్వీకారం లో పాల్గొనాలని తెలియ చేశారు ఈ సందర్భముగా పలువురు సాయి భక్తులు పట్టణ ప్రముఖులు అభినందించారు పట్టణ ఆర్య వైశ్య ప్రముఖులు కొత్తూరు హనుమంతరావు అయినవొలు హనుమంతరావు లు బాలాజీ కి శాలువా కప్పి అభినందించారు.

స్కూల్ లెవెల్ క్రికెట్ ,పుట్ బాల్ టోర్నమెంట్స్ ప్రారంభం

శుభ తెలంగాణ ఒంగోలు ఆగస్ట్11: జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక సంతపేటలోని డి.ఆర్.ఎం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడా సంబరాలు శుక్రవారం ప్రారంభమైనాయి. హైస్కూల్ లెవెల్ స్థాయిలో జరుగుతున్న క్రికెట్ %ఉ% పుట్ బాల్ టోర్నమెంట్స్ ను డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారిని డాక్టర్ వి. పుష్పలత,లార్డ్ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ అద్దంకి మురళీకృష్ణ ప్రారంభించారు.
ముఖ్య అతిథిగా హాజరైన పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ.. క్రీడా పోటీలు యువతలో చైతన్యాన్ని,ఐకమత్యానికి, ఆరోగ్యంతో పాటు మానస వికాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం అతిథులు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు. ఎజె సొల్యూషన్స్ డైరెక్టర్ శ్రీమతి ప్రియ,శ్రీ సాయి కాలేజీ ఆఫ్ హెల్త్ సైన్స్ డైరెక్టర్ లక్ష్మి, కోచూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కమిటీ సభ్యులు చిక్కాల కిరణ్ కుమార్. భాస్కర్,కిట్టు, నవీన్,శంకర్ .గోపాల్ తదితరులున్నారు.

బిఆర్ఎస్ పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి.

- వెంకటాపురం గ్రామంలో ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం హేయమైన చర్య.
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెవిటి సధాకర్ యాదవ్.

శుభ తెలంగాణ తొర్రూర్ డివిజన్ :అధికార బిఆర్ఎస్ పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలను మానుకోవాలని తొర్రూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చెవిటి సుధాకర్ యాదవ్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలో గత బుధవారం బోనాల పండుగ సందర్భంగా గుడికి పోయే రోడ్డు ప్రక్కన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్వాగత ఫ్లెక్సీలను తొర్రూరు కాంగ్రెస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాస్ గౌడ్ ఏర్పాటు చేయగా ఆ ఫ్లెక్సీలను వెంకటాపురం గ్రామ బిఆర్ఎస్ నాయకులు గురువారం రాత్రి ధ్వంసం చేయగా వెంకటాపురం గ్రామంలో నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెవిటి సదాకర్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. బిఆర్ఎస్ నాయకులు ఓటమి భయంతో చిల్లర రాజకీయాలు చేస్తూ వెంకటాపురం గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్వాగతం కొరకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ప్రజల్లో ఆమెకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కూడా తొర్రూరు మున్సిపాలిటీ మండల పరిధిలోని మాటేడు గ్రామంలో కూడా ఇదేవిధంగా ఫ్లెక్సీలను ధ్వంసం చేశారని అయినా కూడా మేము వారికి సంబంధించిన ఫ్లెక్సీలను ధ్వంసం చేయలేదని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిఆర్ఎస్ కార్యకర్తల్లాగా దిగజారారని.. మా పార్టీ సిద్ధాంతం దానికి విరుద్ధమని తెలిపారు. ఇప్పటికైనా టిఆర్ఎస్ నాయకులు ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉంటే మంచిదని.. మా మంచితనాన్ని అలుసుగా తీసుకొని ఇలాంటి చర్యలు పునరావృతం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో తొర్రూరు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాస్ గౌడ్, వార్డు మెంబర్ రాయిపల్లి నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరెడ్డి రామ్మోహన్ రెడ్డి, బొలగాని సురేందర్, వీరన్న బాబు, గుండాల వెంకన్న, యాకన్న, మల్లయ్య, ఉప్పలయ్య, వంగ యశోద, లక్ష్మయ్య, వీరన్న, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నియంత పోకడలు మానకపోతే పాలక పక్షానికి రానున్న ఎన్నికల్లో గుణపాఠం నేర్పుతాము

బిజేపి ఫ్లెక్సీల ధ్వంసం పై మండిపాటు, మున్సిపల్ అధికారులు సమాధానం ఇవ్వాలి

పివి శివారెడ్డి.

శుభ తెలంగాణ : ఒంగోలు ఆగస్ట్11:మున్సిపల్ అధికారులా! పాలకపక్ష పనివారలా?? ప్రజలందరినీ సమానంగా ఆలనపాలన చూడవలసిన మునిసిపల్ అధికారులు పాలకపక్ష నేతల మూతులు మాత్రమే తుడుస్తున్నట్లు ఉన్నది. వారు చెప్పినట్లు వినే రోబోట్ మాదిరి వ్యవహరిస్తున్నారంటూ, నగరంలో బిజేపి వారు పెట్టిన ఫ్లెక్సీలను మాత్రమే తొలగించి, వాని ఫ్రేమ్స్ తో సహా ధ్వంసం చేయడం పై తీవ్రంగా స్పందించారు. మున్సిపల్ అధికారులు ప్రజల పట్ల తమ వైఖరి ఏదో వ్యక్తపరచాలని, ఫ్లెక్సీలను ఫ్రేమ్స్ తో సహా ధ్వంసం చేయడం పై సమాధానం చెప్పాలని మండిపడ్డారు. అధికారుల తీరు ఇలాగే ఉంటే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలను చవిచూడవలసి వస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా బిజేపి కార్యకర్తలు రోడ్లపైకి వస్తారని, మీ చర్యలను ఖండిస్తూ నిరసన, ధర్నా కార్యక్రమాలతో మున్సిపల్ కార్యాలయముల దిగ్బంధనం చేస్తామని ప్రకాశంజిల్లా భారతీయ జనతాపార్టి జిల్లా అధ్యక్షులు పివి శివారెడ్డి హెచ్చరించారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, వారికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా, కేంద్రం పంపుచున్న నిధులను సైతం సర్పంచుల ప్రమేయమేమి లేకుండా వానిని పక్కదారి పట్టించిన, గ్రామాభివృద్ధికి పనులుచేసిన చిన్న కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వారిని ఆత్మహత్యలకు పురిగొల్పు రాష్ట్రతీరు పట్ల నిరసన, ధర్నా కార్యక్రమాలను స్థానిక జిల్లా కలక్టరేట్ల వద్ద తమ మిత్రపక్షం జనసేనతో కలసి బిజేపి నాయకులు నిర్వహించారు. ఒంగోలు లో సైతం జిల్లా అధ్యక్షులు పివి శివారెడ్డి నేతృత్వంలో కలెక్టర్ కార్యాలయము వద్ద ధర్నా నిర్వహించి ప్రజా సభ ఏర్పాటు చేశారు. ఆ ధర్నాకు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా వచ్చిబుసర్పంచులు పడుచున్న ఇబ్బందులను, ప్రభుత్వ వైఖరిని తూర్పార పట్టారు. దీనిని మనసులో ఉంచుకొన్న పాలకపక్షం అధికార మదంతో... తమ నాయకురాలు విచ్చేస్తున్న సందర్భముగా బిజేపి కార్యకర్తలు నగరంలో పలు కూడళ్ల వద్ద ఏర్పాటుచేసిన స్వాగత ఫ్లెక్సీలను ఫ్రేమ్స్ తో సహా మున్సిపల్ సిబ్బంది చే తొలగించి పూర్తిగ ధ్వంసం చేశారని తెలుసుకొన్న పివి శివారెడ్డి మున్సిపల్ అధికారులను తీవ్ర స్థాయిలో కోపోద్రిక్తులై హెచ్చరించారు. మీ స్వంత నిర్ణయమా లేక తెరవెనుక ఆదేశాలో స్పష్టం చేయాలని హుకుం జారీచేశారు. ప్రభుత్వ పాలనం లోపాలను ఎత్తి చూపడంతో వానిని సరిచేసుకోలేక ఇలా వ్యవహరించడం, నియంత పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలు/ప్రజలు అల్లాడిపోతున్నారని, ఇలాగే కొనసాగితే నివురుగప్పిఉన్న నిప్పు బహిర్గతమై రానున్న సార్వత్రిక ఎన్నికలలో పాలక పక్షాన్ని ఓటుతో భస్మం చేస్తారని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి.

- ఎమ్మెల్యే శంకర్ నాయక్ ప్రగాఢ సానుభూతి.

మహబూబాబాద్ శుభ తెలంగాణ :బుధవారం రోజున అల్లి నరేందర్ రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై,ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం నాడు మృతి చెందడం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురం శివారు లో బిఆర్ఎస్ మండల నాయకులు అల్లి నరేందర్ రెడ్డి(52) తీగలవేణికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే ఆసుపత్రిలో చికిత్స ను అందించారు అందించారని చికిత్స పొందుతూ శుక్రవారం రోజున మృతి చెందాడని ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. నరేందర్ రెడ్డి మృతి చెందాడని విషయం తెలుసుకున్న మహబూబాబాద్ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి కాసిం పిఎసిఎస్ చైర్మన్ లింగారెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ,పార్టీ శ్రేణులు ,కార్యకర్తలు, ప్రముఖులు గ్రామానికి చేరుకొని ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతితో తీగలవేణిలో విషాదజాయాలనుకున్నాయి.

పివైఎల్ లో సభ్యులు గా చేరండి చేర్పించండి

- ప్రగతిశీల యువజన జిల్లా సంఘం అధ్యక్షుడు ఇరుగు అనిల్
- ప్రగతిశీల యువజన సంఘ యూనియన్ సభ్యత్వాన్ని నేడు ప్రారంభించారు

శుభ తెలంగాణ :ఉమ్మడి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ.. ప్రత్యేక గుర్తింపును పొందిన ప్రగతిశీల యువజన సంఘం లో సభ్యులుగా చేరండి,చేర్పించండి అని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఇరుగు అనిల్,అన్నారు. నెల్లికుదురు మండలం బంజర గ్రామంలో యూనియన్ సభ్యత్వాన్ని నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని.. అనేక నిర్బంధాలకు,జైలు జీవితానికి,అక్రమ కేసులకు గురైందని అన్నారు. గుట్కా,పాన్ మసాలా వ్యతిరేక పోరాటంలో అశ్లీల బూతు సాహిత్యలపై ఉద్యమంలో ముందు నిలిచిన పివైఎల్ సంఘంలో సభ్యులుగా చేరాలని అన్నారు. మతోన్మాదం,నిరుద్యోగం, బంధుప్రీతి,అవినీతి లాంటి సామాజిక రుగ్మతలు ప్రజలను పట్టిపీడిస్తున్న నేటి తరుణంలో సామాజిక బాధ్యత చైతన్యం కలిగిన యువతరం నేడు మన దేశానికి అవసరమని అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం పోరాడకుండా మద్యానికి,మత్తుకు బానిసలుగా చేస్తున్న పాలకవర్గ విధానాలపై పివైఎల్ సమరసిల పోరాటాలు చేస్తుందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో గ్రామ,మండల,డివిజన్,జిల్లా రాష్ట్ర స్థాయి మహాసభలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో పరశురాములు,మధు,స్టాలిన్ వెంకన్న, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మాల అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ అశోద భాస్కర్

రోగులకు పండ్ల ను పంపిణి చేస్తున్న మాల మహానాడు శ్రేణులు

శుభ తెలంగాణ:వర్గీకరణ ఉద్యమం లో అసువులు బాసిన అమరుల ఆశయాలను కొనసాగిస్తామని జాతీయ మాల మాహనాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ఆశోద భాస్కర్, అన్నారు.ఆగష్టు 11 మాల మృతవీరుల దినం సందర్భంగా నేలరాలిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. జాతీయ మాల మాహనాడు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, ఆధ్వర్యంలో...జరిగిన ఈ కార్యక్రమంలో.. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరాయన మాట్లాడుతూ.. జాతి ప్రయోజనాల కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని వారి త్యాగాలు వృధా కావన్నారు. వారి ఆశయ సాధన కోసం నిత్యం పనిచేస్తామని శబదం పూనారు.ఈ కార్యక్రమంలో.. జిల్లా కార్యదర్శి దాసరి యాకయ్య,గార ఉపేందర్,యువసేన మండల అధ్యక్షుడు బాణాల సంజీవ, రావిరాల గ్రామ అధ్యక్షుడు ఆరే ఐలయ్య,పత్తి దర్గయ్య, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంపీటీసీ మదన్

శుభ తెలంగాణ :బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్, పిలుపుమేరకు ఈరోజు మానుకోట బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సిరికొండ సంపత్ అధ్యక్షతన కలెక్టర్ ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంపీటీసీ మదన్, మాట్లాడుతూ... లక్షలాది మంది పోరాడి, వందలాది మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో 10 ఏళ్ళు అవుతున్నా, ఉద్యోగ నియామకాలు లేక, నిరుద్యోగ భృతిపై ఎటువంటి నిధులు, ప్రకటన చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ వైఖరి, నిరుద్యోగుల పట్ల తెలంగాణ రాష్ట్ర వివక్షా విధానాలను భారతీయ జనతా యువమోర్చా తీవ్రంగా ఖండిస్తోంది 2018ఎన్నికల్లో యువతకు ప్రతినెలా నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ప్రతినెలా 3,016, ఇప్పటివరకు 56 నెలల మొత్తం 1,68,896 రూపాయల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం టిఎస్పిఎస్సి బోర్డ్ నోటిఫికేషన్లు, పరీక్షల, నియమాలను తప్పుల తడక మార్చి నిరుద్యోగుల, యువకుల తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిన టీఎస్పీఎస్సీ చైర్మన్ ను సస్పెండ్ చేయాలి లక్షలాదిమంది నిరుద్యోగ అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్2 పరీక్షను 3 నెలల సమయం ఇచ్చి తరువాత పరీక్ష నిర్వహించాలి జరగబోయే అన్ని పరీక్షలు లీకులు, తప్పులు లేకుండా, అభ్యర్థులకు సౌకర్యవంతమైన పరీక్షా కేంద్రాల ఏర్పాట్లు చేసి పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి చేపట్టబోయే ఉద్యోగ నియామకాలు ఏవిధమైన అవకతవకలు, అవినీతి, పైరవీలు లేకుండా సజావుగాజరపాలి.విషయాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిర్ణయం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాంఈ కార్యక్రమంలో.. బిజెపి మానుకోట అసెంబ్లీ కన్వీనర్ మురళి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ రాయుడు,రమేష్, బీజేవైఎం నాయకులు సురేందర్,సురేష్ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి..

శుభ తెలంగాణ :హయత్ నగర్ డివిజన్లోని గుడాల బస్తీలో తాగునీరు సరిగారావడం లేదు అని బస్తీ వాసులు సమాచారం మేరకు శుక్రవారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి, జలమండలి అధికారి సత్తిరెడ్డి తో కలసి బస్తీలో పర్యటించారు. వెంటనే బస్తీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా మంచినీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారికి తెలిపారు.

దయానంద్ నగర్ లో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కె పి వివేకానంద్

శుభ తెలంగాణ : కుత్బుల్లాపూర్ నియోజవర్గం 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని దయానంద్ నగర్ లో రూపాయిలు పదిలక్షల వ్యయంతో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్లోని ప్రతి కాలనీ ప్రతి బస్తీలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఇప్పటికే దాదాపుగా 90 శాతం పనులు పూర్తి చేసుకోగలిగామని మిగిలిన పనులను కూడా త్వరతగినిగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు డివిజన్ అధ్యక్షులు పోలీస్ శ్రీకాంత్ సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, వెంకట స్వామి, యూసఫ్, ప్రభాకర్, కావాలి రవి, ఖాసీం, మైనారిటీ అధ్యేక్షులు మహమ్మద్ బాలి, యాదగిరి, తార సింగ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధనకై చలో హైదరాబాద్

- ధరావత్ వీరన్న మండల అధ్యక్షుడు
- యేదునూరి అశోక్ మండల ప్రధాన కార్యదర్శి

శుభ తెలంగాణ :
పాత పెన్షన్ సాధనకై హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో12-08-2023న తలపెట్టిన పాత పెన్షన్ సాధన బహిరంగ సభను విజయవంతం చేయండి ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సిపిఎస్ ఉద్యమానికి ఊతం ఇవ్వండి ఒక్కరైతే ఒంటరె ఒక్కటైతే ఉప్పెనె అనే మన నినాదాన్ని నిజం చేయండి అభి లినహీతో కబీ నహి అనే నినాదంతో కదం తొక్కి మన పాత పెన్షన్ కలను సాకారం చేసుకోవడానికి ఉద్యోగ ఉపాధ్యాయులందరూ కదలిరావాలని %ూజూూజుఖ% మహబూబాబాద్ మండల అధ్యక్షులు ధారావత్ వీరన్న ప్రధాన కార్యదర్శి యెదునూరి అశోక్ పిలుపునిచ్చారు

రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు

- స్నేహితుల సహకారంతోనే ప్రజాసేవ
- సేవలో మేటి ఎర్రబెల్లి ట్రస్టు
- ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో తొర్రూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన ఓ కార్యక్రమంలో తొర్రూరు పట్టణ లబ్ధిదారులకు లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులను పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

శుభ తెలంగాణ ఆగస్ట్ 11 (తొర్రూర్ డివిజన్ :)రాజకీయాలకు అతీతంగా తాను సేవ చేస్తున్నట్లు, తన వద్ద డబ్బులు లేనప్పటికీ, పలువురు స్నేహితుల సహకారంతో వినూత్నంగా, విశేషంగా సేవా కార్యక్రమాలు తమ ఎర్రబెల్లి ట్రస్ట్ తరఫున నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గం లో యువతకు ఉచితంగా ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సుల జారీ కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఈ రోజు మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో తొర్రూరు పట్టణానికి చెందిన 150 మందికి ఉచిత లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులను మంత్రి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, ఉషా దయాకర్ రావు గారి నేతృత్వంలో నిర్వహిస్తున్న ఎర్రబెల్లి ట్రస్టు వైద్య ఆరోగ్య శిబిరాలతో పాటు కరోనా కష్టకాలంలో నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఉచిత శిక్షణ ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ, ఉపాధి హామీ కూలీలకు లంచ్ బాక్సుల పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి, ఉద్యోగ శిక్షణ, తాజాగా యువతకు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ వంటి పలు కార్యక్రమాలను దిగ్విజయంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలకు తమ వద్ద డబ్బు లేనప్పటికీ మిత్రులు శ్రేయోభిలాషులు తమ కుటుంబ సభ్యులు తన పిల్లలు ఇస్తున్న డబ్బులతో ఇవన్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు రాజకీయాలకు అతీతంగా సేవ చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. సేవ చేస్తే ప్రజలు మర్చిపోరని తప్పకుండా అండదండలు అందిస్తారని మంత్రి అన్నారు. తగిన సమయంలో తగిన విధంగా స్పందిస్తారని మంత్రి అన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ లేదని మంత్రి అన్నారు. అందుకే తాను నిరంతరం ప్రజా సేవలో ఉంటూనే ప్రజలకు అందుబాటులో ఉంటూనే వారి ఆదరాభిమానాలతో ఎమ్మెల్యేగా గెలుస్తూ ఇవాళ మంత్రిగా ఉన్నానని ఇదంతా ప్రజల ఆశీర్వాదమేనని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలు తనకి ఎప్పుడు ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్సులు పొందిన అభ్యర్థులు, సంబంధిత శాఖకు చెందిన అధికారులు, పలువురు ప్రజలు, పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, ప్రత్యేకించి యువకులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల అక్రమ అరెస్ట్ సిగ్గు చేటు..

శుభ తెలంగాణ : ఆగస్ట్ 11 తొర్రూర్ డివిజన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ఎన్నికల ముందు యువతకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు జిల్లా కలెక్టరేట్ ముట్టడి కి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ రోజు తొర్రూర్ లో పోలీసులు బిజెపి శ్రేణులను ముందస్తు అరెస్టు చేసి తర్వాత సొంత పూచికత్తు పై విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ మాట్లాడుతూ లక్షలాది మంది పోరాడి, వందలాది మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో 10 ఏళ్ళు అవుతున్నా, ఉద్యోగ నియామకాలు లేక, నిరుద్యోగ భృతిపై ఎటువంటి నిధులు, ప్రకటన చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ వైఖరి, నిరుద్యోగుల పట్ల తెలంగాణ రాష్ట్ర వివక్షా విధానాలను ప్రతీ ఒక్కరూ తీవ్రంగా ఖండిస్తున్నారు అని తెలిపారు.

ఎన్నికల్లో యువతకు ప్రతినెలా చెల్లిస్తామని హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి రూ" 3,016, చొప్పున ఇప్పటివరకు 56 నెలల మొత్తం 1,68,896 రూపాయల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

%ూరాజ% బోర్డ్ నోటిఫికేషన్లు, పరీక్షల, నియమాలను తప్పుల తడక మార్చి నిరుద్యోగుల, యువకుల తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిన %ూరాజ% చైర్మన్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

లక్షలాదిమంది నిరుద్యోగ అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్2 పరీక్షను 3 నెలల సమయం ఇచ్చి తరువాత పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.త్వరలో రాష్ట్రంలోజరగబోయే అన్ని పరీక్షలు లీకులు, తప్పులు లేకుండా, అభ్యర్థులకు సౌకర్యవంతమైన పరీక్షా కేంద్రాల ఏర్పాట్లు చేసి పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి అని కోరారు.ఉద్యోగ నియామకాలు ఏవిధమైన అవకతవకలు, అవినీతి, పైరవీలు లేకుండా సజావుగా జరపాలని, డిమాండ్ చేశారు.టీఎస్ పీఎస్సీ కార్యాలయం వద్ద నిరుద్యోగ యువత పై ప్రభుత్వం లాఠీచార్జి చేయించడం సిగ్గు చేటని తక్షణమే లాఠీచార్జి కి పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కేసీఆర్ రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థుల, మేధావులు,అన్ని వర్గాల ప్రజల ను నమ్మించి మోసం చేస్తున్నాడని,ఈ మోసం మరెన్ని రోజులు కొనసాగదని ప్రజలు కేసీఆర్ సర్కారు కు దిమ్మతిరిగే కౌంటర్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు అని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిర్ణయం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, నిరసనలతో పాటు సెక్రటేరియట్, ప్రగతిభవన్ ని ముట్టడిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్,బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మనబోయిన కుమార్,బీజేవైఎం అర్బన్ ప్రధాన కార్యదర్శి నూకల నవీన్, బీజేవైఎం రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి కొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు తొర్రూరు వర్కింగ్ జర్నలిస్టుల వినతి

వర్కింగ్ జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలి.

శుభ తెలంగాణ :కొన్ని సంవత్సరాలుగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో వర్కింగ్ జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజాక్షేత్రంలోకి తీసుకు వెళుతూ ప్రజా సమస్యల పక్షాన జీతాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల అందరికీ రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు తొర్రూరు వర్కింగ్ జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. గత జూన్ లో 40 మంది విలేకరులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయడం హర్షనీయం అలాగే ఇంకొంతమంది వర్కింగ్ జర్నలిస్టులు 25 మంది ఉన్నారు వారికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తే మరింత సంతోషిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతిపత్రం అందజేయగా మరుసటి రోజు అందజేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల విషయంలో విచారణ చేసి సీనియారిటీ ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో దాదాపు రెండు నెలలపాటు మంత్రి మాటపై ఆగిపోయామని అన్నారు. ఈరోజు అనగా శుక్రవారం 11.08.2023 న ఆ 40 మంది మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దగ్గరికి వెళ్లగా మళ్లీ ఆ 40 మందికి ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి అన్నాడనే విషయం తెలియగానే మళ్లీ మంత్రి ఎర్రబెల్లికి మరోసారి వినతి పత్రం అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు 40 మందికి మాత్రమే ఇండ్ల పట్టాలు అందజేయడం సరికాదని వర్కింగ్ జర్నలిస్టులందరికీ తొర్రూరు డివిజన్ కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా వర్కింగ్ జర్నలిస్టులుగా కొనసాగుతున్న వారికి సీనియారిటీ ప్రకారం అందజేయకుండా ప్రభుత్వ పత్రికలు అంటూ కొందరికి.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసిన విలేకరులకు కూడా మరోసారి అందజేసి.. అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కథనాలు రాస్తున్న నిజమైన నిరు పేద వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ 40 మందితో పాటు మరో 25 మంది వర్కింగ్ జర్నలిస్టులకు కూడా రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేసి వారిని కూడా ఆదుకోవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు వర్కింగ్ జర్నలిస్టులు కొమ్మనబోయిన యాకయ్య, సీహెచ్ రామకృష్ణ, వేర్పుల మహేష్, రెడ్డబోయిన దిలీప్, అంకం సురేష్, వెల్తురు పూర్ణచందర్, వీరాంజనేయులు, సారయ్య, మహేందర్, కుక్కల కృష్ణ, బొచ్చు మురళి, కటకం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదింటికి పెద్దన్నగా కేసీఆర్

- ఆడబిడ్డల పెండ్లికి మేనమామ కట్నంగా కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు
- పాలకుర్తి నియోజకవర్గ స్థాయిలో 99 మందికి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి

శుభ తెలంగాణ :తెలంగాణ రాష్ట్రంలో పేదింటి పెద్దన్నగా సీఎం కేసీఆర్ గారు నిలిచిపోయారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ స్థాయిలో 99 మంది పేదింటి ఆడబిడ్డలకు పాలకుర్తి లో గల క్యాంపు కార్యాలయంలో మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఆడబిడ్డ పెండ్లికి మేనమామగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందచేస్తున్న ఘనత సీఎం కెసిఆర్ గారిదేనని అన్నారు. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడ లేదని ఇలాంటి సంక్షేమ పథకాలను అందచేస్తున్న ఘనత %దీ=ూ% పార్టీ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజల కోసమే పనిచేస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం కెసిఆర్ గారికి, %దీ=ూ% పార్టీకి మనమంతా రుణపడి ఉండాలి అన్నారు. మరోసారి %దీ=ూ% పార్టీని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నల్లని శ్రీనివాసరావు ను పరామర్శించిన మంత్రి ఎమ్మెల్యే

శుభ తెలంగాణ :మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామంలో నల్లని శ్రీనివాసరావు మాతృమూర్తి సరస్వతి ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మరియు తుంగతుర్తి శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి కోఆర్డినేటర్ ఎస్ ఎ రజాక్ మరియు ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర /వెంకన్న జడ్పీటీసీ కన్నా సూరంభ /వీరన్న, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి, వివిధ గ్రామల సర్పంచ్లు ఎంపీటీసీ లు గ్రామ శాఖ అధ్యక్షులు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన పంజాల రామాంజనేయులు గౌడ్



వలిగొండ ఆగస్టు 11 శుభ తెలంగాణ :వలిగొండ మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన పలుసం ముత్తయ్య గౌడ్ అనారోగ్యంతో మృతిచెందగా యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్ వారి యొక్క పార్థివ దేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జడ్పిటిసి వాకిటి పద్మ అనంతరెడ్డి, పోత్నక్ ప్రమోద్ కుమార్, పాశం సత్తిరెడ్డి, పబ్బు శీను , సామ రామిరెడ్డి, పలుసం స్వామి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేదింపులకు గురిచేస్తున్న పోకిరిలు అరెస్టు..

- 59 మందిని అదుపులోకి తీసుకున్న రాచకొండ షీ టీమ్స్..
- తల్లిదండ్రుల సమక్ష్యంలో కౌన్సెల్లింగ్..

శుభ తెలంగాణ :రాచకొండ కమిషనర్ డిఎస్. చౌహాన్ ఆదేశానుసారం, రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షి టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. రాచకొండ కమిషనరట్ పరిదిలో మహిళలను, యువతులను వేదింపులకు గురిచేస్తున్న 59 మందిని షీ టీమ్స్ అరెస్టు చేసినారు. వారికి శుక్రవారం ఎల్‌బినగర్ సిపి క్యాంప్ ఆఫీసులో కుటుంబ సబ్యుల సమక్షంలో కౌన్సెల్లింగ్ నిర్వహించడం జరిగింది. 13 మే 2023 నుండి 30 జూన్ 2023 వరకు 197 పిర్యాదులు అందినవి అని డిసిపి ఉమెన్ సేఫ్టీ వింగ్ రాచకొండ టి. ఉషారాణి తెలిపారు. ఫిర్యాదుల పై విచారణ చేపట్టి దర్యాప్తు పూర్తి చేశామన్నారు. అందిన పపిర్యాదులలో ఫోన్ల ద్వారా వేదించినవి – 30, వాట్సప్ యాప్ కాల్స్ %ఉ% మెసేజెస్ ద్వారా వేదించినవి –40, సోషల్ మీడియా యాప్స్ ద్వారా వేదించినవి – 20, ఇతర – 28. వాటిలో క్రిమినల్ కేసెస్ – 44, పెట్టి కేసెస్ – 29, కౌన్సెల్లింగ్ – 45 కాసులు నమోదు చేశామన్నారు. షీ టీమ్స్ వారు స్కూళ్ళు, కాలేజీలు, హాస్టళ్ళు, రద్దీ ప్రదేశాలలో హాట్ స్పాట్స్ ని గుర్తించి మఫ్టీ లో డెకాయ్ ఆపరేషన్ చేసి స్త్రీలను ఇబ్బంది పెట్టే 106 మంది ఆకతాయిలను గుర్తించారు. గుర్తించిన ఆకతాయిలకు కౌన్సెల్లింగ్ నిర్వహించడం జరిగింది. అదేవిదంగా షి టీమ్స్ 150 అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ద్వారా 13000 అవేర్నెస్ కల్గించడం జరిగింది.

ఛేదించిన కేసులలో కొన్ని..

1.మైనర్ బాలికతో స్విగ్వి బాయ్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన. ఇందులో ఫిర్యాదుదారు ఉప్పల్ ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఆమె పొరుగువారు స్విగ్వి ద్వారా ఆర్డర్ బుక్ చేసారు. సిగ్వి బాయ్ డెలివరీ ఇవ్వడం కొరకు వచ్చాడు, లిఫ్ట్ లోబాధిత బాలిక వయస్సు 5 సంవత్సరాలు, అ బాలిక మాత్రమే లిఫ్ట్‌లో ఉంది, ఇదే అదనుగా బావించి ఆమెతో తప్పుగా ప్రవర్తించాడు. దీంతో బాధిత బాలిక తన తల్లిదండ్రులకు సమాచారం అందించింది. వారు షి టీమ్స్ ను సంప్రదించగ కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగింది.

2.జాబ్ పేరుతో మోసం

దీసుఖ్నగర్ హాస్టల్ వుండే అమ్మాయికి, ఆమెకు జాబ్ ఇస్తామని, అన్నీ సర్టిఫికేట్ తీసుకొని, కొన్ని రోజుల తరువాత జాబ్ ఇవ్వకుండా, ఫోన్ ద్వారా వేదించడం చేశాడు. అడిగినన్ని డబ్బులు ఇవ్వాలని లేకపోతే, ఆమె ఫోటోలను న్యూడ్ గా మార్చి సోషల్ మేడియాలో పెడుతనని బెదిరించాడు. దీనితో అమ్మాయి వాట్సప్ ద్వారా షి టీమ్ ని సంప్రదించగ , అ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగింది. ఆపరేషన్

3.షీటీమ్ మల్కాజిగిరి ఆనంద్ బాగ్ %ఇ% రోడ్ వద్ద డికాయ్ ఆపరేషన్ నిర్వహించి రోడ్డు మీద వెలుతున్న మహిళను %ఉ% కాలేజీ గర్ల్స్ ని వెకిలి చేస్తాలతో వేదిస్తున్న 5 మందిని పోకిరిలను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి కౌన్సెల్లింగ్ చేయడం జరిగింది. ఆడవారికి ఎదురయ్యే భౌతిక పరమైన దాడులు, లైంగిక వేదింపులు, ప్రయాణ సమయాల్లో వేదింపులు వంటి ఇబ్బందుల నుంచి రక్షించేందుకు రాచకొండ పోలీసులు ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. పురుషులు, సాటి ఆడవారి పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని, పలు రకాల అవసరాలతో ఇంటి నుంచి బయటకు వచ్చే స్త్రీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. స్త్రీలను గౌరవించడం తమ వ్యక్తిత్వంలో భాగం కావాలని, ఆడవారిని ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు వేదింపులకు గురి అయినప్పుడు వెంటనే షీ టీమ్స్ రాచకొండ వాట్సప్ నెంబర్ – 8712662111 ద్వారా, లేదా ప్రాంతాల వారిగా భువనగిరి – 8712662598, చౌటుప్పల్ – 8712662599, ఇబ్రహీంపట్నం – 8712662600, కుషాయిగూడ – 8712662601, ఎల్బీనగర్ – 8712662602, మల్కాజ్గిరి – 8712662603, వనస్థలిపురం – 8712662604 ఈ నెంబర్ల ద్వారా సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి టి. ఉషా రాణి, షీ టీమ్స్ ఏసిపి నరేందర్ గౌడ్, షీ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న వంగరలో మనస్థాపనతో వ్యక్తి ఆత్మహత్య

శుభ తెలంగాణ :మధ్యాహ్నం అందాధ 02:00 గంటల ప్రాంతం లో పెద్దవంగర మండలం లోని చిన్నవంగర గ్రామం లో బొమ్మెర ఉపేందర్ %హ/శీ% లేట్ సోమయ్య, వయసు : 38 సం.లు, కులం : గౌడ, వృత్తి : కూలి, %=/శీ% చిన్నవంగర గ్రామం గారు, గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్నప్పటికీ తగ్గకపోవడంతో మనోవే వేదనతో, ఈరోజు తన తల్లి, భార్య కూలికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తీవ్రమైన కడుపు నొప్పితో భరించలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని చనిపోయినాడు ఇట్టి మరణం పై తన తల్లి అయిన బొమ్మెర లక్ష్మీ నరసమ్మ %ఔ%/0 సోమయ్య గారి దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరిగింది.

పురుగులు మందు సేవించి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి.

శుభ తెలంగాణ :మూడు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్ఐ గన్ రెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం టేకులపల్లి మండల కేంద్ర గ్రామపంచాయతీ పరిధి ఏ కాలనీ తండా గ్రామానికి చెందిన దారావత్ శంకర్ (48) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉంటున్నాడు అనారోగ్య సమస్య వలన ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని బాధితుడు ఈనెల 8వ తేదీ మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పురుగు మందు తాగాడు విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య దారావత్ విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. మృతుడు రోజువారి కూలి పనులకు వెళ్తాడు. అతడికి భార్య విజయ పిల్లల్లు లేరు.

విద్యార్థుల దగ్గర అక్రమ వసూలు ఆపి వేయాలి.

- అక్రమ వసుళ్లకు పాల్పడుతున్న కోరే వెంకన్న పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్.దేవేందర్.

(శుభ తెలంగాణ :గూడూరు మండలంలోని పొనుగోడు జిల్లా పరిషత్ హై స్కూల్ ను దత్తత పేరుతో అక్రమ వసులకు పాల్పడుతున్న కోరే.వెంకన్న పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, అతనికి వత్తాసు పలుకుతున్న మాజీ ఎస్ఎంఎస్ చైర్మన్ మహమ్మద్ జమీల్ లపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ఆధ్వర్యంలో పొనుగోడు జడ్పీహెచ్ఎస్ స్కూల్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ జడ్పీహెచ్ఎస్ ను దత్తత తీసుకున్న కోరే వెంకన్న విద్యార్థులకు శాపంగా మారారు,అని స్కూల్ విద్యార్థుల దగ్గర అడ్మిషన్ పేరా అక్రమ వసూలు చేస్తూ అతనిని వ్యతిరేకించిన ఉపాధ్యాయులను ఎంఈఓ, డిఈఓ తో కుమ్మకై బదిలీ చేస్తున్నారన్నారు. స్కూల్లో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలపై విద్యాధికారులకు చెప్పిన స్పందించకపోవడం వల్ల కోరే వెంకన్న ఆగడాలు పెచ్చరిల్లుతున్నాయని అతనికి వత్తాసుగా మాజీ ఎస్ఎంఎస్ చైర్మన్ మహమ్మద్ జమీల్ సహకారంతో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు భాస్కర్, గణేష్, సాయి కుమార్, అఖిల్, సాయిరాం, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయునికి అశ్రునివాళి

గ్రామంలో అలుము కున్న విషాదఛాయలు

శుభ తెలంగాణ :యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నర్సాయిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు తుమ్మల నరసయ్య మాజీ సర్పంచిగా మాజీ ఎంపీపీగా రెండు దాపాలుగా ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ,సున్నితమైన మనస్తత్వం గల వ్యక్తి బడుగు బలహీన వర్గాల కు సేవ చేసిన మహా వ్యక్తి ఆయన అకాల మరణం వలిగొండ మండలంలోని బడుగు బలహీన వర్గాల కు తీరని లోటు అని అఖిలపక్షం పార్టీ ఆధ్వర్యంలో ఆరూరు గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల నాయకులు వలిగొండ జడ్పిటిసి వాకిటిపద్మ అనంతరెడ్డి, బిజెపి పార్టీ జిల్లా నాయకులు సిఎన్ రెడ్డి, మాజీ సర్పంచ్ దానయ్య పోలేపాక చెమ్మేయ్య. బండారు నరసింహారెడ్డి. బుర్ర నరసింహ, కసర బోయిన లింగయ్య, ఓరుగంటి స్వామి, ఆవుల బిక్షపతి, ఆవుల స్వామి. జింకల మల్లయ్య, ఎలిమినేటి వెంకటేష్, ఎలిమినేటి సంతోష్, కొప్పుల మచ్చ గిరి ,శంకర్ యువకులు కలిసి భారీ ఎత్తున పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హరీష్

శుభ తెలంగాణ :రంగారెడ్డి జిల్లాలోని రాజేందర్ నగర్ ఈవీఎం గోడౌన్స్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి తనిఖీలో భాగంగా శుక్రవారం కలెక్టర్ హరీష్ ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచి తనిఖీచేశారు.ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అనుకోని రీతిలో ప్రమాదాలు సంభవించినసమయాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన అగ్నిమాపక సామగ్రి, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సైదులు, బిఆర్ఎస్, బిజెపి, ఎమ్ఐఎమ్,కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

ఆజాదికీ అమృత మహోత్సవం

- స్కూల్ పిల్లలతో ప్రతిజ్ఞ చేస్తున్న బిజెపి మండల నాయకులు

శుభ తెలంగాణ :బీజేపీ టేకులపల్లి మండల కమిటీ ఆధార్యంలో టేకులపల్లి గవర్నమెంట్ హై స్కూల్ లో ప్రధానపాధ్యాయుని భద్రు సార్ అనుమతితో ఆజాదికఅమృతోత్స వాలలో భాగంగా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బీజేపీ టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్ వి. హత్తిరామ్ నాయక్ పిల్లలకు ప్రధానమంత్రి మోదీ సూపరిపాలన ప్రపంచ దేశాలలో భారతదేశం యొక్క పాత్ర వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం ను మోదీ విశ్వగురువుగా తీర్చిదిద్దుతున్నారని మనమందరం మోదీ గారికి రుణపడి ఉండాలని 2047 నాటికీ ప్రపంచంలో అగ్రగామిగా ఉంచాలని మనమందరం దేశం కోసం దర్మం కోసం కట్టుబడి కష్టబడి పనిచేయాలని తెలియజేస్తూ పంచ ప్రాణాల ప్రతిజ్ఞ చేయంచారు ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు బాలాజీ నాయక్ ఉపాధ్యక్షులు రాములు నాయక్ సీనియర్ నాయకులు చిక్కా వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పిల్లలు పాలుగోన్నారు

హామీ ఇస్తే తప్పనిసరి చేస్తా ఎమ్మెల్యే రెడ్యానాయక్..

శుభ తెలంగాణ :సీరోల్ మండలంలోని చిలుక్కోయలపాడు, అందనాలపాడు,సీతల తండా, కొత్త తండా, మొద్దుగడ్డతండా, మన్నెగూడెం ,గ్రామంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ , పర్యటించారు. కార్యకర్తలు ప్రజలు ఆట పాటలతో కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామాలలో ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. తండాలకు , ప్రతి గ్రామంలో నిరుపేదలకు మూడు లక్షలతో గృహ లక్ష్మి పథకం క్రింద ఇండ్లు మంజూరి ఇస్తున్నామని అన్నారు , దళితులకు దళిత బంధు వచ్చేలా చూస్తామని అన్నారు రైతులకు రుణమాఫీ బిసి బందు లక్ష రూపాయలు ఇస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలు నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నున్న రమణ, మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపాలిటీ చైర్మన్ వీరన్న, జెడ్పిటిసి కమల రామనాథం, మండల యూత్ అధ్యక్షులు హరీష్, గొల్ల చర్ల సత్తిరెడ్డి, సొసైటీ చైర్మన్ బిక్షం రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప సర్పంచ్లు వార్డ్ నెంబర్లు ప్రజలు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం..

శుభ తెలంగాణ :కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని శుక్రవారం నాడు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి చికిత్సలు 72 మందికి నిర్వహించారు. ఇందులో పాకడమందికి దృష్టిలోపం ఉన్నట్టు కంటి వైద్య నిపుణులు హరికిషన్ తెలిపారు. వీరికి చికిత్స నిమిత్తం బోధన్ లైన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. మరో ప్రధాన మందికి కంటి అద్దాలు అవసరమని అన్నారు. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, మరియు డాక్టర్ శివకుమార్, సభ్యులు సంతోష్ మరియు పేషెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్ తగిలి యువ రైతు మృతి

శుభ తెలంగాణ :కరెంట్ షాక్ కు గురై రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నాతల్ల గూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే వలిగొండ మండలంలోని నాతల్లగూడెం గ్రామానికి చెందిన రైతు జెట్ట లింగస్వామి(38) రోజు మాదిరిగానే పొలం వద్దకు వెళ్లి మోటర్ ఆన్ చేయగా నీళ్లు రాకపోవడంతో మోటార్ దగ్గర నుంచి ఫుట్ వాల్ దగ్గర చెత్త తీసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించడం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై పెండ్యాల ప్రభాకర్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి జెట్ట నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :ChandrShekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com